

నానో ఎరువుల వాడకంపై లక్ష్మణచాందలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

నానో యూరియా, డీఏపీ వల్ల దిగుబడి.. రైతుకు రాబడి

» జిల్లా వ్యవసాయ అధికారి అంజి ప్రసాద్

లక్ష్మణచాంద, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): నానో యూరియా, డీఏపీ వాడటం వలన పంటల దిగుబడి పెరిగి రైతులు రాబడి పెరుగుతుందని ఆత్మ చైర్మన్ రాంరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం నుంచి రైతు వేదిక వరకు నానో యూరియా, డీఏపీ ఇతర ఎరువులు వాడటం వలన కలిగే ప్రయోజనాలపై అవగాహన కోసం ర్యాలీ నిర్వహించారు. అనంతరం రైతు వేదికలో రైతులతో జరిగిన సమావేశంలో పలువురు అధికారులు, నాయకులు మాట్లాడారు. నానో ఎరువుల వాడకం వలన పంటల దిగుబడులు పెరిగి రైతుల ఆదాయం పెరుగుతుందన్నారు. భూ కాలుష్యం, గాలి, నీటి కాలుష్యం పెరగకుండా అరికట్టబడుతుందన్నారు. శాస్త్రవేత్తల సూచనల మేరకు మన ప్రభుత్వాలు వీటి వాడకం కోసం రైతులను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. నానో ఎరువులు వాడుతున్న రైతులను శాలువాతో సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ వైస్ చైర్మన్ రఘునందన్ రెడ్డి, ఆత్మ చైర్మన్ రాంరెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఈటెల శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఓడ్నాల రాజేశ్వర్, మండల నాయకులు సురకంటి ముత్యం రెడ్డి, వ్యవసాయ సంచాలకులు విద్యాసాగర్, వ్యవసాయ అధికారి వసంత్ రావు, విస్తీర్ణ అధికారులు పవిత్ర, మౌనిక, సుష్మిత, నాయకులు నరేష్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి, జీవన్ రెడ్డి, ఆత్మ డైరెక్టర్లు, ఎరువుల డీలర్లు, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ విద్యార్థుల సామూహిక వందేమాతరం

ముథోల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): వందేమాతరం గేయం 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా నియోజకవర్గ కేంద్రమైన ముథోల్‌లోని ఆశ్రమ పాఠశాలలో బుధవారం ఎన్‌సీసీ విద్యార్థులచే సామూహిక వందేమాతరం గీతాలాపన చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం. సూర్యదాస్, ఉపాధ్యాయ బృందం, ఎన్‌సీసీ విద్యార్థులు, ఏఎన్‌వో గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.



వందేమాతరం గీతాలాపన చేస్తున్న ఎన్‌సీసీ విద్యార్థులు



'అవినీతి'కి.. అందలం!

జిల్లాలో పైరవీకారులకే కీలక పోస్టింగ్‌లు

» జిల్లాలో ఓ అధికారి నియామకంపై సర్వత్రా అనుమానాలు
» రాజకీయ ఒత్తిళ్లతోనే కీలక పోస్టింగ్
» పలు కీలక శాఖలకు సంబంధించిన అధికారుల నియామక వ్యవహారంపై విమర్శలు

జిల్లాలో కీలక శాఖలకు.. సంబంధించిన అధికారుల నియామక వ్యవహారంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అవినీతి ఆరోపణలున్న అధికారులకు కీలక పోస్టింగులు కేటాయించడం పట్ల భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రాజకీయ నేతల సిఫారసులకు తలొగ్గి ఈ నియామకాలు చేపట్టినట్లు చెబుతున్నారు. కొంతమంది బడా నాయకులు తమ పనులను చక్కదిద్దుకునేందుకు కొంతమంది అధికారుల నియామకాలకు సంబందించి పెద్దఎత్తున ఒత్తిడి తీసుకువచ్చినట్లు చెబుతున్నారు. ప్రభుత్వ స్థాయిలో ఒత్తిడి తీసుకు వచ్చి ఆరోపణలు సైతం పక్కన పెడుతూ పోస్టింగ్‌లు ఇవ్వడం పట్ల పలువురు అవాక్కవుతున్నారు.


నిర్మల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ముఖ్యంగా జిల్లా కేంద్ర పరిధిలోని రెవెన్యూ శాఖకు సంబందించి ఓ అధికారికి కేటాయించిన పోస్టింగ్ వ్యవహారం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. గతంలో ఇక్కడే పని చేసిన ఆ అధికారి ఏసీబీకి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడి ఇప్పటికీ విచారణ ఎదుర్కొంటున్నారు. ఏసీబీ కేసులో అరెస్టు అయ్యి కొంతకాలం తరువాత ఆయనకు నిజామాబాద్ జిల్లాలో ఎన్నికల సందర్భంగా తిరిగి పోస్టింగ్ ఇచ్చారు. ప్రస్తుతం ఆ అధికారిపై అంతర్గత విచారణ కొనసాగుతున్నట్లు సమాచారం. అయితే మళ్లీ ఆ అధికారిని ప్రభుత్వం జిల్లా కలెక్టరేట్‌కు బదిలీ చేసింది. మొదట ఆ అధికారికి కలెక్టరేట్‌లోనే లూప్‌లైన్ పోస్టింగ్ కేటాయించారు. ఆ తరువాత గతంలో భూముల వ్యవహారానికి సంబందించి అనుభవం ఉన్న ఆ అధికారిని మళ్లీ తెరపైకి తీసుకువచ్చేందుకు రాజకీయ నేతలు రంగంలోకి దిగారు. తమ రాజకీయ పలుకుబడితో ఉన్నతాధికారులపై ఒత్తిళ్లు తీసుకువచ్చి ఏసీబీకి పట్టుబడిన ఆ అధికారిని నిర్మల్ రూరల్ మండలంలో కీలక రెవెన్యూ అధికారిగా నియమించడం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. భూముల వ్యవహారంలో అప్పట్లోనే ఆరోపణలు ఎదుర్కొన్న ఆ అధికారికి తిరిగి నిర్మల్ మండలంలో కీలక పోస్టును డిప్యూటేషన్‌పై కేటాయించడం విమర్శలకు తావిస్తోంది. సదరు అధికారి తీరు కారణంగా రెవెన్యూ శాఖలోని ఇతర అధికారులు ఈ వ్యవహారంపై చర్చించుకుంటూ రాజకీయ ఒత్తిళ్ల ప్రాధాన్యతపై గుసగులాడుతున్నారు.

ఆరోపణలను పక్కన పెట్టి..

గతంలో సంబంధిత అధికారిపై ఆరోపణలు వెల్లువెత్తడమే కాకుండా ఆయన ఏసీబీకి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడినప్పటికీ ఆయనకు కీలక పోస్టింగ్ కేటాయించడం విమర్శలకు తావిస్తోంది. ముఖ్యంగా నిర్మల్ మండల పరిధిలో కీలకమైన భూ వ్యవహారాలు కొనసాగుతున్న నేపథ్యంలోనే సదరు అధికారికి ఈ పోస్టింగ్ కేటాయించడంపై సర్వత్రా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తమ భూములకు సంబందించిన వ్యవహారాలను కాపాడుకునేందుకే ఈ పోస్టింగ్‌లను కొంతమంది నిర్వహించారంటున్నారు. ఉన్నతాధికారులపై అన్నిస్థాయిల్లో ఒత్తిడిలు తీసుకువచ్చి ఈ పోస్టింగ్‌ను చేపట్టారంటున్నారు. ఆరోపణలను అలాగే గతంలో ఉన్న వ్యవహారాలను పరిగణలోకి తీసుకోకుండా నిర్వహించిన ఈ పోస్టింగ్ వ్యవహారంపై సంబంధిత రెవెన్యూ శాఖలోనే భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతుండడం ప్రాధాన్యతను సంతరించుకుంటోంది.

అడుగడుగునా రాజకీయ ఒత్తిళ్లు

రెవెన్యూ శాఖలో గత కొద్ది రోజుల నుంచి రాజకీయ ఒత్తిళ్లు తీవ్రమైనట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఉన్నతాధికారులు కఠినంగా వ్యవహరిస్తున్నా.. వారికి రాజకీయ ఒత్తిళ్లు తప్పడం లేదంటున్నారు. ఒత్తిళ్లు తీవ్రం కావడంతోనే కఠిన వ్యవహారాన్ని పక్కన పెడుతున్నారని చెబుతున్నారు. ప్రస్తుతం జిల్లాలో ఉన్నతాధికారులు క్రియాశీలకంగా విధులు నిర్వహించి పరిపాలనను కొనసాగిస్తున్న క్రమంలో రాజకీయ పైరవీలు వారి కఠినతరమైన విధులకు ఆటంకాలు కల్పిస్తున్నా యన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మొదట్లో కిందిస్థాయి రాజకీయ నేతల సిఫారసులను అధికారు లు పట్టించుకోకపోతున్నా.. రాష్ట్రస్థాయి ఒత్తిళ్ల కారణంగా ఉన్నతాధికారులు గత్యంతరం లేని పరిస్థితుల్లో పోస్టింగ్‌లను కేటాయిస్తున్నరన్న వాదనలున్నాయి. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అప్పటి ధరణిని పక్కన పెట్టి రెవెన్యూ వ్యవస్థను గాడిన పెట్టేందుకు భూ భారతిని అమలు చేస్తున్న క్రమంలోనే ఇలాంటి ఆరోపణలు తలెత్తుండడం సమంజసం కాదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు రెవెన్యూ శాఖకు సంబందించి మండల స్థాయి అధికారుల నియామకంలో ఆరోపణలు లేని వారిని ఎంపిక చేయాలని కోరుతున్నారు.





తానూర్‌లోని ప్రభుత్వ కళాశాలలో తనిఖీ చేస్తున్న ప్రత్యేకాధికారి

కళాశాలలో ప్రత్యేకాధికారి విస్తృత తనిఖీలు

తానూర్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను బుధవారం మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులు హాజరును, అధ్యాపకుల వివరాలను పరిశీలించారు. ఎఫ్ఆర్ఎస్ నమోదు, యూడైస్ నమోదులో ఆధార్ అప్‌డేషన్లలో ఉన్న సమస్యలను అధికారి దృష్టికి కళాశాల సిబ్బంది తీసుకెళ్లారు. అదే విధంగా నూతన భవనం కోసం కళాశాలలో డ్యూయల్ డెస్క్, బెంచెస్, ఇతర మౌళిక సదుపాయాల గురించి అధికారి దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అధికారి శ్రీధర్, ఎంఈవో నరేందర్, కళాశాల ప్రిన్సిపాల్ ఫణి రాజశేఖర్, ఉన్నారు.

జిల్లా కేంద్రంలో లాయర్ల ఆందోళన

నిర్మల్ టౌన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): కోర్టులో సరెండర్ చేసేందుకు ముద్దాయితో కలిసి వస్తున్న లాయర్ కారుపై పోలీసులు దౌర్జన్యం చేశారంటూ బుధవారం నిర్మల్ జిల్లా కేంద్రంలో న్యాయవాదులు ఆందోళనకు దిగారు. జిల్లా సివిల్ న్యాయాధికారి కోర్టు ముందు నిరసన వ్యక్తం చేశారు. లాయర్‌పై దాడికి యత్నించిన పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. పోలీసుల తీరును నిరసిస్తూ సోమవారం వరకు తమ విధులను బహిష్కరిస్తున్నట్లు వారు ప్రకటించారు.

షిర్డీకి చేరుకున్న పాదయాత్ర



షిర్డీకి చేరుకున్న సాయి భక్తులు

నిర్మల్ చైన్‌గేట్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన సాయి భక్తులు చేపట్టిన పాదయాత్ర బుధవారం షిర్డీకి చేరుకుంది. స్థానిక గండి రామన్న క్షేత్రం నుండి గత నెల 30వ తేదీన 17 మంది సాయి భక్తులు షిర్డీకి కాలినడకన బయలుదేరిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా భక్తులు మాట్లాడుతూ 13 రోజుల పాటు సాగిన ఈ పాదయాత్రలో సాయిబాబా కృపతో ఎలాంటి ఇబ్బంది కలుగ లేదన్నారు. ఈ పాదయాత్ర కోసం సాయి దీక్ష సేవా సమితి అధ్యక్షుడు లక్కడి జగన్మోహన్ రెడ్డి అందించిన సహకారం మరువలేనిదన్నారు. జగన్మోహన్ రెడ్డితో పాటు పలువురు సాయి భక్తులు ఈ పాదయాత్ర కోసం తమవంతుగా సహాయాన్ని అందించారని, వారికి సాయి బాబా కృప ఎల్లవేళలా ఉండాలని ప్రార్థిస్తున్నామన్నారు. కాగా అంతకుముందు కాలినడకన షిర్డీకి చేరుకున్న సాయి భక్తులకు జగన్మోహన్ రెడ్డి తదితరులు ఘనంగా స్వాగతం పలికి సన్మానించారు. ఈ పాయదాత్రలో ఉప్పుల నందు, గాంధారి రాజన్న, ధనుంజయ్ రావు, రాజ గోపాల్, పరమేశ్వర్, సీతారాం, అశోక్, సాయినాథ్, పోశెట్టి, లింగవ్వ, జయమ్మ, లలిత, సంగీత, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పనులు వేగవంతం చేయాలి

» ఎంపీడీవో లవ కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో లవ కుమార్

ముథోల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల పనులు వేగవంతం చేయాలని ఎంపీడీవో లవ కుమార్ పేర్కొన్నారు. మండల కేంద్రమైన ముథోల్‌లోని మండల అభివృద్ధి కార్యాలయంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులకు అలాగే ఏపీవో, ఎంపీవో, ఈజీఎస్ సిబ్బందికి, ఏఈవోలకు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో ఇది వరకు ఇందిరమ్మ ఇళ్లు వచ్చి మార్కౌట్ తీసుకొని పనులు చేపట్టని వారికి పనులు ప్రారంభమయ్యేలా, మార్కౌట్ లేని వారికి మార్కౌట్ వేసి ఇళ్లను ప్రారంభించేలా చూడాలని పంచాయతీ కార్యదర్శులకు ఎంపీడీవో సూచించారు. అలాగే సంబంధిత వివరాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే జాతీయ ఉపాధి హామీ పనుల్లో సంబంధించిన ఈకేవైసీని పెండింగ్ లేకుండా పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో, ఏఈవోలకు పీఎంఏవైజీ గురించి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో శివ కుమార్, ఏపీవో శిరీషారెడ్డి, హౌసింగ్ ఏఈ, ఉపాధి హామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, ఏఈవోలు, తదితరులున్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

కుంటాల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం కుంటాల స్థానిక ఆదర్శ మాడల్ పాఠశాలలో బుధవారం విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు బాలశక్తి కార్యక్రమంలో భాగంగా వైద్యులు మతీన్, ఫార్మాసిస్ట్ గౌతమి, ఏఎన్ఎం రమ పాల్గొని విద్యార్థుల ఎత్తు, బరువు, రక్తహీనత, తదితర పరీక్షలను నిర్వహించారు. విద్యార్థులు ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జీ ప్రిన్సిపాల్ ఉమేష్ రావు, తదితరులు ఉన్నారు.



కుంటాలలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

వెలగనిద్దాం.. దాంపత్య దీపం

» మహిళల సంరక్షణే పోలీసుల ప్రధాన ధ్యేయం
» నిర్మల్ జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల



నిర్మల్ జిల్లా జడ్జికి స్వాగతం పలుకుతున్న ఎస్పీ డా. జానకి షర్మిల

నిర్మల్ చైన్‌గేట్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): నిర్మల్ జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో బుధవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు భరోసా సెంటర్‌లో భరోసా కౌన్సెలింగ్ ద్వారా తిరిగి కలుసుకున్న అన్ని జంటలతో జిల్లా ఎస్పీ డా. జానకి షర్మిల ఆధ్వర్యంలో శ్రీవాణి జిల్లా ప్రధాన న్యాయమూర్తి ముఖ్యఅతిథిగా కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలో తొలి మహిళా ఎస్పీగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి నిర్మల్ పోలీస్ మీ పోలీస్ అంటూ నిర్మల్ పట్టణంలో భరోసా సెంటర్‌ను ప్రారంభించి అక్కడ ఉద్యోగస్తులను నియమించుకుని అందరూ అందుబాటులో ఉండేవిధం గా నిరంతరం ఎస్పీ డా.జి.జానకి షర్మిల స్వీయ పర్యవేక్షణలో భరోసా కేంద్రాన్ని దానిలో షీ టీమ్‌తో నడుపుతున్నారు. ఇక్కడ చిన్న చిన్న సమస్యలతో, క్షణికావేశంలో, చిన్న చిన్న మనస్పర్థలతో, కుటుంబ కలహాలతో దూరంగా ఉంటున్న కుటుంబ సభ్యులకు, భార్యభర్తలకు భరోసా కేంద్రంలోని నిష్ణాతులచే ఒక ఇన్స్‌పెక్టర్ మహిళా ఎస్సై పర్యవేక్షణలో కౌన్సిలింగ్ ఇప్పించటం జరుగుతుంది. వారు చెప్పే మాటలు ఓపిగ్గా విని ఒక్కసారి చెపితే వినకపోతే మరలా మరలా పిలిపించుకొని వారిని ఒకటి చేయటమే ధ్యేయంగా ముందుకెళ్తున్నారు. ఇప్పటి వరకు 110 జంటల కుటుంబ జీవితాలను నిలబెట్టటం జరిగింది. కలిసిన జంటలు, వారి కుటుంబ సభ్యుల ఆనందానికి అవధులు లేవు. వీరందరూ ఎస్పీ స్వీయ నేతృత్వంలో పనిచేస్తున్న జిల్లా షీ టీమ్ సేవలను కొనియాడారు. ఓపికతో మా బాధలు వినటమే కాకుండా మమ్మల్ని ఒకటి చేయటానికి భరోసా సభ్యులు చేసిన కృషి మరువలేనిదని కొనియాడారు. మా బాధలు మా కుటుంబ సభ్యులే వినేవారు కాదు. సమాజంలోని కొంత మంది సూటి పోటి మాటలతో మానసికంగా హింసించేవారు. కానీ షీ టీమ్ సభ్యులు ఓపికతో మా కుటుంబ పెద్దల్లాగా విని ఇరువురికి సర్దిచెప్పటమే కాకుండా జీవితాంతం కలిసి ఉండేలా సూచనలు ఇవ్వటం హర్షించదగ్గ విషయం అన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మహిళల భద్రతకు భరోసానిస్తూ, బాధిత మహిళలను, పిల్లలను అక్కున చేర్చుకుని, కొండంత ధైర్యాన్నిస్తూ, మహిళల సమస్యలకు తక్షణ పరిష్కారం చూపటమే లక్ష్యంగా జిల్లా షీ టీమ్ సేవలు అందిస్తుందన్నారు. జిల్లాలోని ఏ ప్రాంతమైన సరే తప్పకుండా పోలీసులు ఇంటి వారిలాగా పరిగణించి ఏ సమస్య వచ్చినా చెప్పుకుంటే తప్పకుండా సమస్యకి పరిష్కారాన్ని చూపేలా ప్రయత్నం చేయడంలో నిర్మల్ జిల్లా పోలీస్ యంత్రాంగం 100 శాతం పని చేస్తుందనే నమ్మకం మీలో కలగాలన్నారు. ఎందుకంటే దాంపత్య జీవితం అనేది ప్రతీఒక్కరి జీవితంలో వెలుగులు పంచేలాగా ఉండాలి తప్పితే సమస్యల వల్ల విడిపోయి దూ రంగా ఉండడం ఇరువురికి ఎంత బాధని కలిగిస్తుందో ప్రతీ ఒక్కరికి తెలుసు అని అందుకోసం ఎలాంటి సమస్య వచ్చినా తప్పకుండా భరోసా సెంటర్‌లోని షీ టీమ్ సిబ్బందిని గాని లేదా జిల్లా ప్రధాన పోలీస్ కార్యాలయంలో వచ్చి చెప్పిన కూడా తప్పకుండా తోడుగా ఉండి సమస్యలను పరిష్కరించే దిశగా పని చేస్తామని హామీ ఇస్తున్నాను. అలా అని పోలీసులు వారి జీవన శైలి సైతం అందరికీ తెలిసిందే. వృత్తి ధర్మానికి న్యాయం చేయాలని కోణంలో ఆలోచిస్తూ చాలా సందర్భాల్లో తమ సొంత కుటుంబాలకు కూడా ఇవ్వలేని సమయాన్ని నిర్మల్ జిల్లా ప్రజల కోసం కేటాయిస్తున్నారు. అందుకు ప్రతి ఒక్కరికి పేరు పేరునా అభినందనలు తెలియజేస్తున్నానని తెలిపారు. ఫ్యామిలీ కౌన్సెలింగ్ సెంటర్ ద్వారా వివిధ పోలీస్ స్టేషన్‌లలో నమోదైన పోక్సో అత్యాచార కేసులలో కౌన్సెలింగ్ నిర్వహించడం జరుగుతుందన్నారు. మహిళలు, పిల్లలపై జరిగే నేరాలను, హింసలను తగ్గించడమే ఈ కేంద్రం ప్రధాన లక్ష్యమని, మహిళలు, యువతులు, బాలికలు అన్యాయానికి గురైనప్పుడు భయపడొద్దని, ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేస్తూ నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ డా. జి.జా నకి షర్మిల తెలిపారు. ఇక్కడ షీ టీమ్ సభ్యులు కూడా ఉన్నారని వారు బాలికల, మహిళల, విద్యార్థుల భద్రత, రక్షణ కోసం పనిచేస్తున్నాయని, ఎవరైనా ఆకతాయిలు వేధింపులకు గురిచేసిన, మానసికంగా, శారీరకంగా హింసించిన, సోషల్ మీడియాలో ఫోటోలను మార్చి వేధింపులకు గురిచేసిన వారి వివరాలను షీ టీమ్ పోలీసులకు సమాచారం ఇస్తే ఆకతాయిలను పట్టుకొని వారు మైనర్‌గా ఉంటే కౌన్సిలింగ్ ఇవ్వడం, మేజర్‌గా అయితే కేసులు నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్స్‌పెక్టర్లు, ఆర్ఐలు, ఎస్సైలు, ఆర్ఎస్సైలు, మహిళా ఎస్సై సుమాంజలి, జ్యోతిమణి, పెర్సిస్, సుప్రియ, శ్రావణి, జిల్లా పోలీస్ అధికారుల కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు సన్మానం

నిర్మల్ చైన్‌గేట్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మైనార్టీ ఉర్దూ డే సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో రాష్ట్ర మైనార్టీ శాఖ మంత్రి మహమ్మద్ అజారుద్దీన్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఉర్దూ అకాడమి చైర్మన్ తాయార్ బిన్ అందాన్ చేతుల మీదుగా నిర్మల్ జిల్లా సియాసత్ ఉర్దూ డైలీ పేపర్ సీనియర్ జర్నలిస్ట్ సయ్యద్ జలీల్ అజార్ అవార్డును అందుకొని ఘన సన్మానం పొందడం జరిగింది. బుధవారం నిర్మల్ జిల్లా కేంద్రంలోని సియాసత్ జిల్లా కార్యాలయంలో సయ్యద్ జలీల్ అజార్‌ని గౌడజన హక్కుల పోరాట సమితి మోకుదెబ్బ, జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పూలమాలలు, శా లువాతో ఘనంగా సన్మానించారు. ట్రస్మా రాష్ట్ర కమిటీ నాయకులు సబ్బర్ అలీ, మోకుదెబ్బ జిల్లా అధికార ప్రతినిధి పీసర శ్రీనివాస్ గౌడ్, మైనార్టీ నాయకులు అజ్మత్ ఖాన్, అర్షద్ అలీ, ఆరిఫ్, తదితరులు పాల్గొన్నారు.



సయ్యద్ జలీల్ అజార్‌ను సన్మానిస్తున్న దృశ్యం

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి

» సంక్షేమ హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలి
» నిర్మల్ జిల్లా ప్రభుత్వ యూనివర్సిటీని ఏర్పాటు చేయాలి
» వాగ్మారే మహేందర్, డీపీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు



విద్యార్థులతో నిరసన ర్యాలీ ప్రదర్శిస్తున్న దృశ్యం

నిర్మల్ చైన్‌గేట్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, రీయింబర్స్‌మెంట్ బకాయిలను పూర్తిస్థాయిలో విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) ఆధ్వర్యంలో బుధవారం డా. బీఆర్. అంబేద్కర్ చౌక్ నుంచి వివేకానంద చౌక్ వరకు 200ల మంది విద్యార్థులతో నిరసన ర్యాలీ ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు వి.మహేందర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో నాలుగు సంవత్సరాలుగా దాదాపుగా 8 కోట్ల రూపాయల స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టి రెండు సంవత్సరాలు పూర్తి కావస్తున్నా కూడా విద్యా వ్యవస్థపై నిర్లక్ష్యం వహిస్తూ కాలయాపన చేస్తుందన్నారు. రీయింబర్స్‌మెంట్ విడుదల కాక కళాశాలల నిర్వహణ కష్టమై ఇప్పటికే రాష్ట్రంలో పదుల సంఖ్యల్లో కళాశాలు మూతపడ్డాయని తెలియజేశారు. దేశ చరిత్రలోనే కనీవినీ ఎరుగని రీతిలో విద్యాశాఖ మంత్రిని కూడా నియమించలేని దౌర్భాగ్య స్థితిలో తెలంగాణ ప్రభుత్వం ఉందని మండిపడ్డారు. నిర్మల్ జిల్లాలో అద్దె భవనాల్లో కొనసాగుతున్న వసతి గృహాలకు సొంత భవనాలు నిర్మించాలని కోరారు. అదే విధంగా జిల్లాలో ప్రభుత్వ యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే పోస్ట్ మెట్రిక్ విద్యార్థులకు ప్రతీ నెల రూ. 500ల కాస్మొటిక్ చార్జీలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షులు పవార్ కిరణ్, పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకులు అనిల్, పీడీఎస్‌యూ జిల్లా నాయకులు అద్విత్, గంగరాజు, ధ్రువ, రెండు వందల మంది విద్యార్థులు పాల్గొన్నారు.

వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే రామారావు

భైంసా రూరల్, నవంబరు 11 (ఆంధ్ర జ్యోతి) : మండలంలోని వాలేగాం గ్రామంలో వరి కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఎమ్మెల్యే రామారావు పటేల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తమ పంటను దళారులకు అమ్ముకొని మోసపోవద్దని సూచించారు. రైతులకు వరి కొనుగోలు కేంద్రాల వద్ద ఎటువంటి ఇబ్బంది పడకుండా చూసుకోవాలని అధికారులకు ఆదేశించారు. ప్రతీ రైతు కొనుగోలు కేంద్రాన్ని సద్వి నియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ఆనంద్ రావు పటేల్, పీఏసీఎస్ చైర్మన్ దేవేందర్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

వరి కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

నర్సాపూర్(జి), నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాంపూర్, నర్సాపూర్ గ్రామాల్లో డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలను మార్కెట్ కమిటీ చైర్మన్ సోమ భీమ్ రెడ్డి బుధవారం లాంఛనంగా ప్రారంభించారు. రైతులకు మద్దతు ధర కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ కొనుగోలు కేంద్రాలు అన్నదాతలకు ఎంతో ఉపయుక్తంగా ఉండనున్నాయి. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు ఇంద్రకరణ్ రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు బర్కుంట నరేందర్, పాక్స్ చైర్మన్ రమణా రెడ్డి, పాక్స్ డైరెక్టర్ మహేష్, మాజీ ఎంపీపీ కొండ్ర రేఖ రమేష్, మాజీ జడ్పీటీసీ రామయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్ అజీమ్, మండల తహసీల్దార్ శ్రీకాంత్, ఎంపీడీవో పుష్పలత, ఏపీఎం గంగామణి, సీసీ లావణ్య, కమిటీ మెంబర్లు, ఇతర అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



నర్సాపూర్ (జి)లో కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న దృశ్యం

సిరిచెల్మ ప్రాంతంలో పెద్ద పులి సంచారం

- సాత్మోరీలో లేగదూడని చంపేసిన పెద్దపులి
- పెద్దపులి సంచరించినట్లు నిర్ధారించిన అటవీ శాఖ అధికారులు

సిరికొండ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): సిరిచెల్మ కవ్వాల్ టైగర్ జోన్, సిరికొండ సెక్షన్ రిమ్మ బీట్ పరిధిలోని అటవీప్రాంతంలో పెద్ద పులి సంచారం కలకలం రేపుతోంది. బుధవారం తెల్లవారు జామున సిరికొండ మండలం రిమ్మ బీట్ పరిధిలోని సాత్మోరీ గ్రామ అటవీ పరిసర ప్రాంతం చేనులోనే పంట కావాలి నిమిత్తం ఓ గుడి సెలో నివసిస్తున్న మేస్రం బొజ్జు అనే రైతు యొక్క లేగదూడపై పెద్దపులి దాడి చేసి చంపేసింది. ఇదీ గమనించిన రైతు వెంటనే నిద్ర నుంచి మేల్కొని కేకలు వేయగా.. లేగదూడను అక్కడే వదిలేసి పారిపోయిందని ఆ రైతు తెలిపాడు. దీంతో అటవీప్రాంతంలో పెద్దపులి సంచరించినట్లు స్థానికులు గుర్తించి అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. బుధవారం ఉదయం సిరిచెల్మ కవ్వాల్ టైగర్ జోన్ ఎఫ్ఆర్వో నాగవత్ స్వామి, ఇంద్రవెల్లి ఎఫ్ఆర్వో సంతోష్, సిరికొండ ఎఫ్ఎస్వో చంద్రారెడ్డిలు అటవీశాఖ సిబ్బందితో కలిసి అడవిలో పులి సంచరించిన ప్రాంతానికి చేరుకుని, పాద ముద్రలను పరిశీలించారు. ఈ సందర్భంగా అటవీశాఖ అధికారులు పాదముద్రలను పరిశీలించి పులి సంచారం నిజమేనని అధికారికంగా నిర్ధారించారు. కాగా బోథ్ మండలం అటవీ ప్రాంతం నుంచి పులి వచ్చి ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇటీవల బోథ్ పరిసర అటవీప్రాంతంలో ఆవులపై పెద్ద పులి దాడిచేసి చంపేసినట్లు అధికారులు గుర్తించారు. దీంతో మండలంలోని సాత్మోరీ, వాయిపేట్, కుంటగూడ, భీంపూర్ తదితర ఆదివాసీ గ్రామాల ప్రజలు తమ చేలల్లోకి వెళ్లడానికి భయపడుతున్నారు.



పెద్దపులి పాదముద్రలను పరిశీలిస్తున్న అటవీ శాఖ అధికారులు



సాత్మోరీ గ్రామ అటవీలో పెద్దపులి దాడిలో మరణించిన లేగదూడ

● ఎలాంటి భయాందోళనలకు గురికావొద్దు

అటవీ ప్రాంతంలోని ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికావొద్దనీ సిరిచెల్మ కవ్వాల్ టైగర్ జోన్ ఎఫ్ఆర్వో నాగవత్ స్వామి సూచించారు. రైతులు పంటచేలలోకి ఒంటరిగా గాకుండా గుంపుగా వెళ్ళాలని, పశువులను అడవిలోకి ఒంటరిగా తీసుకెళ్లరాదని తెలిపారు. ఏదైనా ఘటన జరిగితే వెంటనే అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. సాత్మోరీ గ్రామ అటవీ పరిసర ప్రాంతాల్లో పెద్దపులి నిఘా కోసం సీసీ కెమెరాలు సైతం ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఎస్వోలు రాజేందర్, చంద్రారెడ్డి, బీట్ అధికారులు సంతోష్ భీంజీ నాయక్, హీరాలాల్, బేస్ క్యాంప్ సిబ్బంది పాల్గొన్నారు.



ఉట్నూర్‌లో పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్

మానవత్వం చాటుకున్న అమ్మ ట్రస్టు

ఉట్నూర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఉట్నూర్ గిరిజన ప్రాంతాల్లో చలి తీవ్రత పెరుగుతున్న దృష్ట్యా ప్రజలు జాగ్రత్తలు తీసుకొని అప్రమత్తంగా ఉండాలని అమ్మ ట్రస్టు స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు బొడ్డు కిరణ్ అన్నారు. మంగళవారం రాత్రి ట్రస్టు ఆధ్వర్యంలో ఉట్నూర్ పట్టణంలో తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్ చేతుల మీదుగా చిన్నారులకు పెద్ద వారికి దుప్పట్లు పంపిణీతో పాటు దుస్తులు పంపిణీ చేశా రు. సంస్థ వ్యవస్థాపకులు బొడ్డు కిరణ్ మానవత్వం చాటుకున్నారని ఈ సందర్భంగా ప్రవీణ్‌కుమార్ అభినందించారు. చలి తీవ్రత పెరగడంతో పిల్లలు పెద్దవారు చాలా అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు. చలి తీవ్రత వల్ల ముఖ్యంగా చిన్న పిల్లలను చాలా జాగ్రత్తగా చూసుకోవాలని తల్లిదండ్రులకు సూచించారు. అమ్మట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ దుప్పట్ల పంపిణీ కార్యక్రమం చాలా మంచి కార్యక్రమం అని ఇలాంటి కార్యక్రమాలు మరెన్నో చేపట్టాలని సూచిస్తూ బొడ్డు కిరణ్ సేవలను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో చందు, సన, గోపి, పృథ్వి, హరి, మరికంటి నారాయణ, సాధని సంతోష్, సూర్యకిరణ్, మల్లికార్జున్, దినేష్, మరికంటి కిరణ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

కుంటాల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం కుంటాల స్థానిక ఆదర్శ మాడల్ పాఠశాలలో బుధవారం విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు బాలశక్తి కార్యక్రమంలో భాగంగా వైద్యులు మతీన్, ఫార్మాసిస్ట్ గౌతమి, ఏఎన్ఎం రమ పాల్గొని విద్యార్థుల ఎత్తు, బరువు, రక్తహీనత, తదితర పరీక్షలను నిర్వ హించారు. విద్యార్థులు ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జీ ప్రిన్సిపాల్ ఉమేష్ రావు ఉన్నారు.



కుంటాలలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ప్రభుత్వ ఆస్పత్రి తనిఖీ చేసిన ఎమ్మెల్యే

ఉట్నూర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఉట్నూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో మంగళవారం రాత్రి ఖానాపూర్ ఎమ్మె ల్యే వెడ్మబొజ్జుపటేల్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగుల వార్డులను తిరుగుతు వారి బెడ్స్ వద్దకు వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. వైద్య సిబ్బందితో కలిసి అన్ని వార్డులను తిరుగుతు పరిశీలించారు. ఆసుపత్రిలోని ఔషదాలను పరిశీలించి రోగులకు కావల్సిన మందులను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు.



ఉట్నూర్ ఆస్పత్రిని తనిఖీ చేసి రోగులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొజ్జుపటేల్

గంగారాం కుర్మే మరణం తీరని లోటు

● ఎమ్మెల్యే అనిల్ జాదవ్



గంగారాం కుర్మే చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

నేరడిగొండ నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): గంగారాం కుర్మే మరణం సాహితి లోకానికి తీరని లోటని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని గంగారాం కుటుంబ సభ్యులను పరామర్శించి మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు.వారు రచించిన పునాదిరాయి, ముద్దుగుమ్మ, దమ్మపతం, శిలాఫలకం, ఆనవాళ్లు తదితర కవిత్వాలు సాహిత్యంలో చెరగని ముద్ర వేశాయని పెర్కోన్నారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, దెవెందర్ రెడ్డి, రవిందర్‌రెడ్డి, సురేందర్, శివారెడ్డి, జహీర్ పండరి, మాజీ ఏంపీటీసీలు, సర్పంచ్‌లు ఉన్నారు.

అన్నదాతలకు అండగా నిలవాలి: జోగు రామన్న



మాట్లాడుతున్న మాజీ మంత్రి జోగు రామన్న

ఆదిలాబాద్ టౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : రైతులు పండించిన పంటలను కొనుగోలు చేయడంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కొర్రీలు పెడుతుందని, దీంతో వారు పంటలను ప్రభుత్వానికి కాకుండా ప్రైవేట్ వ్యాపారులకు విక్రయించుకోవాల్సిన పరిస్థితి ఉందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న అన్నారు. బుధవారం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో పత్తి కొనుగోల్లలో కపస్ కిసాన్ యాప్, తేమ శాతం తదతర అంశాలపై నాయకులతో కలిసి సమావేశం నిర్వహించారు. సమస్యలపై చర్చించి రైతులకు అండగా ప్రభుత్వాల తీరుకు వ్యతిరేకంగా దశాలవారీగా ఉద్యమాలు చేపట్టేందుకు కార్యాచరణ రూపొందించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు జోగు రామన్న మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిబంధనల కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నానరు. పంటలు పండించే వరకు ఒక ఇబ్బంది అయితే విక్రయించడానికి మరో ఇబ్బంది ఉందన్నారు. కపాస్ కిసాన్ యాప్‌లో రైతులకు బుకింగ్ ఇబ్బందులు వస్తున్నాయన్నారు. జిన్నింగ్ల ఎంపికలో ఎల్ 1, ఎల్ 2, ఎల్ 3 అని కెటగిరిలో పెట్టి అయోమయానికి గురి చేస్తున్నారని తెలిపారు. కుటుంబ యజమాని రావాలని గతంలో ఎన్నడూ లేని విధంగా నిబంధనలు సీసీఐ తీసుకువచ్చిందన్నారు. తేమ శాతం పేరిట ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. రైతులు పం డించిన పంటలను ఎలాంటి ఇబ్బందులు లేకుండా కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో సీసీఐ కొనుగోళు చేయాలని డిమాండ్ చేశారు. అప్పటి వరకు రైతులకు అండగా బీఆర్ఎస్ ఉంటుందని స్పష్టం చేశారు.

ఎంపీడీవోకు సన్మానం

నార్నూర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): నార్నూర్ మండల ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరించిన పుల్లారావును నాయకులు సన్మానించారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో దళిత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంతోష్ మానే, గిరిజన జిల్లా నాయకులు మాన్‌సింగ్ రాథోడ్ కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి ప్రాంత వాస్తులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో దళిత, గిరిజన నాయకులు పాల్గొన్నారు.

అడ్డగోలు.. దందా!

(5వ పేజీ తరువాయి...)

చూపుతున్నారు. దీంతో సీసీఐకి తీవ్ర నష్టం వాటిల్లుతుంది. ఇదంతా అధికారులకు తెలిసినా.. తెలియనట్లుగానే వ్యవహరిస్తున్నారు. ఉదాహరణకు ఒక జిన్నింగ్ మిల్లులో 5వేల క్వింటాళ్ల సర్కీ నిల్వలు ఉంటే.. అందులో నుంచి 3వేల క్వింటాళ్లను ముందే అమ్మేసుకుంటూ.. ఆ తర్వాత టెండర్లు వేస్తు రికార్డుల్లో మాత్రం తప్పుడులెక్కలు చూపుతున్నారు. రికార్డు లెక్కలకు, క్షేత్రస్థాయి నిల్వలకు ఏమాత్రం పొంతన లేకుండానే పోతుంది. సీసీఐకి డబ్బులు చెల్లిస్తేనే సర్కీని అమ్ముకునే అవకాశం ఉన్న వ్యాపారులు నిబంధనలు పట్టించుకోవడం లేదని తెలుస్తుంది. దీనిపై సీసీఐ ఉన్నతాధికారులు దృష్టి సారిస్తే అక్రమాలకు అడ్డుకట్ట పడే అవకాశం ఉంటుంది.

వ్యాపారులు చెప్పిందే లెక్కా.

పత్తి వ్యాపారంలో ఆరితేరిన కొందరు జిన్నింగ్ వ్యాపారులు అడ్డగోలు సంపాదనకు ఎగబడుతున్నారు. పత్తి ప్రాసెసింగ్ ప్రెసింగ్‌లో తెలివిగా వ్యవహరిస్తూ సీసీఐని తప్పుతోవ పట్టిస్తున్నారు. నాణ్యత లేని పత్తిని రైతుల వద్ద తక్కువ ధరకే కొనుగోలు చేస్తున్న వ్యాపారులు ప్రాసెసింగ్ చేసి సీసీఐకి అంటగడుతున్నారు. జిన్నింగ్ మిల్లుల్లో స్టాక్ నిల్వలకు, వ్యాపారులు చెప్పే లెక్కలకు అసలు పొంతనే లేదంటున్నారు. వేల క్వింటాళ్ల సర్కీని పక్కదారి పట్టించి సీసీఐకి మాత్రం తప్పుడు నివేదికలను ఇస్తున్నట్లు తెలుస్తుంది. ధర ఎక్కువగా ఉన్నప్పుడు సర్కీని అమ్మేసుకుంటున్న వ్యాపారులు ధర తగ్గిన తర్వాత టెండర్లు వేస్తూ తక్కువ ధరతో సీసీఐకి చెల్లిస్తున్నారు. గత వారంరోజుల క్రితం క్వింటాలు సర్కీ రూ.3,800లు కాగా ప్రస్తుతం రూ.3,400 ధర పలుకుతుంది. అంటే వ్యాపారులు ఏస్థాయిలో లాభాలను జేబులో వేసుకుంటున్నారో తెలుస్తునే ఉంది. క్షేత్రస్థాయిలో సీసీఐ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో వ్యాపారులు చెప్పిందే లెక్కాగా మారింది. జిల్లాలో సర్కీ అక్రమాలపై విజిలెన్స్ కమిటీని వేసి విచారణ జరిపిస్తే కోట్ల రూపాయల అవకతవకలు బయటపడే అవకాశం ఉందంటున్నారు.

పోలీసులు ప్రజలతో మమేకమై నేరాలను నివారించాలి

- ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్



ఇచ్చోడ పోలీస్ స్టేషన్‌లో సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

ఇచ్చోడ, నవంబరు, 12 (ఆంధ్రజ్యోతి): పోలీసులు తమ విధులను క్రమశిక్షణతో నిర్వహిస్తూ ప్రజలతో మమేకమై నేరాలను నివారించాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. బుధవారం ఇచ్చోడ పోలీస్ స్టేషన్‌లో వార్షిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు వ్యవస్తను పటిష్టపరిచి చట్టాలపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉట్నూర్ ఏఎస్పీ కాజల్‌సింగ్, సీఐ బండారి రాజు ఎస్సై, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దిల్లీ బాంబు పేలుళ్ల మృతులకు నివాళి

ఇచ్చోడ, నవంబరు, 12 (ఆంధ్రజ్యోతి) : దిల్లీ బాంబు పేలుళ్ల మృతులకు ఇచ్చోడ మండల, పట్టణ ప్రజలు బుధవారం నివాళులర్పించారు. ఇచ్చోడలో పోలీస్ స్టేషన్ నుంచి శివాజీ చౌక్ వరకు కొవ్వొత్తుల ర్యాలీని చేపట్టిన ప్రజలు ముందుగా పోలీస్ స్టేషన్ నుంచి ప్రారంభించిన ర్యాలీలో అక్కడే ఉన్న ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, ఉట్నూర్ ఏఎస్పీ కాజల్‌సింగ్, సీఐ రాజు కొవ్వొత్తుల ర్యాలీకి హాజరై నివాళులర్పించారు. అనంతరం అక్కడి నుంచి ర్యాలీగా వస్తున్న ప్రజలు దాడికి పాల్పడ్డ ఉన్మాదులను కఠినంగా శిక్షించాలని నినాదించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, మహేష్, రాము, రవి పాల్గొన్నారు.

చలికాలంలో జీవాల సంరక్షణ తప్పనిసరి

- బైంసా పశువైద్యాధికారి డా. విఠల్



మూగజీవానికి వ్యాధి నివారణ టీకాలు వేస్తున్న పశువైద్యాధికారి

బైంసా, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రానున్న మూడు నెలల్లో మంచు, చలిగాలులు ఎక్కువగా ఉండే అవకాశముంది. వర్షాలు పడటం, పచ్చగడి పు ష్కలంగా లభించడం, సకాలంలో ఎదకు వచ్చి పునరుత్పత్తి సామర్థ్యం పెరగడం వల్ల పాడి పశువులకు మంచి రోజులని బైంసా పశువైద్యాధికారి డా.విఠల్ తెలిపారు. చలికాలంలో మూగ జీవాల సంరక్షణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలను సూచించారు.

● పశువుల కొట్టం చుట్టూ తెరలు, గోనె పట్టలు, దుప్పట్లు కప్పి ఉంచాలి. అలాగని పూర్తిగా మూత వేయడం వల్ల అమ్మోనియా గాఢత పెరిగి శ్వాసకోశ సమస్యలు తలెత్తే అవకాశముంది.

● కొట్టంలో వరి గడ్డిని నేలపై పరుపులా వేయాలి. తడి లేకుండా జాగ్రత్తలు పడాలి. ● చెట్ల కింద పశువులను కట్టే పశుపోషకులు ఎండ తగిలేటట్లు కొమ్మలు కత్తిరించాలి. ● ఉదయం మంచు తగ్గిన తరువాతే మేతకు వదలాలి. ● రోజూ పెట్టే దాణా కంటే 20 శాతం ఎక్కువగా అందించాలి. రాత్రి వేళ పెట్టకూడదు. ● పచ్చిగడ్డి మాత్రమే కాకుండా ఎండుగడ్డిని అందించడం ద్వారా పశువులకు అవసరమైన పీచు పదార్థం అంది వాటి శరీర ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయిలో ఉంటాయి. ● పాలల్లో వెన్న శాతం పెరుగుతుంది. ఖనిజ లవణ మిశ్రమం ఇవ్వాలి. ● పశువులు తాగడానికి గోరువెచ్చని నీరు అందుబాటులో ఉంచాలి. ● పేడ పరీక్షలు చేయించడంతో పాటు నట్టల నివారణ మందులు వేయాలి. ● పాలు పితికే ముందు, తరువాత పొడి వస్త్రం తప్పనిసరిగా తుడవాలి. ● దూడలను కాపాడుకోవాలంటే గోరువెచ్చని నీటితో స్నానం చేయించడం, వాటిపై గోనె పట్టలు కప్పి ఉంచాలి.

వన్యప్రాణుల వల్ల నష్టపోయిన రైతులకు పరిహారం అందేలా చూడండి

బోథ్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): వన్యప్రాణుల మూలంగా పంట నష్టపోయిన రైతులకు నష్ట పరిహారం తక్షణమే అందే విధంగా చూడాలని బోథ్ నేచర్ కన్జర్వేషన్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు తహసీల్దార్ సుభాష్‌చంద్రకు వినతిపత్రం అందించారు. రైతులు నష్టపోయిన వెంటనే రెవెన్యూ అటవీ శాఖ అధికారులు సర్వేలు నిర్వహించి తక్షణం పరిహారం అందించే విధంగా చూడాలన్నారు. శాఖల మధ్య సమన్వయం పొరబడడం వల్ల బాధిత రైతులకు పరిహారం అందడంలోజాప్యం జరుగుతుందని వాపోయారు. వినతి పత్రం అందించిన వారిలో సొసైటీ అధ్యక్షుడు షేక్‌ఆలీ, ఉపాధ్యక్షులు పురుషోత్తం, కోశాధికారి వెండి పృథ్వి, సభ్యులు అబ్దుల్, రమణగౌడ్, బిక్కులక్ష్మణ్ తదితరులున్నారు.



తహసీల్దార్ సుభాష్‌చంద్రకు వినతిపత్రం ఇస్తున్న సభ్యులు

ప్రభుత్వం అందించే నిధులు ప్రజా ప్రయోజనార్థం వినియోగిస్తున్నాం

- నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ టౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): నిర్మల్ జిల్లాకు వివిధ శాఖలకు ఆయా రూపాల్లో వచ్చిన నిధులు, ఆదాయ వివరాలను ఫైనాన్స్ కమిషన్ చైర్మన్‌కు కలెక్టర్ అభిలాష అభినవ్ వివరించారు. ఆదిలాబాద్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య అధ్యక్షతన జరిగిన సమీక్షా సమావేశంలో కమిషన్ సభ్యులు రమేష్, కార్యదర్శి కాత్యాయినిదేవి, జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, స్థానిక సంస్థల ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. సమకూరుతున్న ప్రతి రూపాయిని ప్రజాప్రయోజనార్థం వినియోగిస్తున్నట్లు తెలిపారు. జిల్లా గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీలలో వివిధ మార్గాలలో ఆదాయ పెంపునకు చర్యలు చేపట్టినట్లు వివరించారు. ప్రజాప్రయోజనార్థం వినియోగిస్తున్న నిధులకు సంబంధించి, సంబంధిత అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహిస్తూ నిధుల వినియోగం పారదర్శకంగా జరిగేలా చర్యలు చేపట్టామని తెలిపారు. అనంతరం రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ సిరిసిల్ల రాజయ్య, సభ్యులు రమేష్, కార్యదర్శి కాత్యాయిని దేవిలను అధికారులు శాలువాలు, జ్ఞాపికలతో సత్కరించారు. ఈ సమావేశంలో ఉమ్మడి జిల్లా కలెక్టర్ రాజర్షి షా, కుమార్ దీపక్, వెంకటేష్ దోత్రే, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లు సోమ రాజేశ్వర్, ఫైజాన్ అహ్మద్, దీపక్ తివారి, పంచాయతీ రాజ్, శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

సమాజ సేవా కార్యక్రమాలను విస్తృతపర్చాలి

బైంసా, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): అరె మరాఠా ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ సమాజ సేవా కార్యక్రమాలను విస్తృతపర్చే దిశగా ముందుకు సాగాలని అరె మరాఠ సంఘం బైంసా అధ్యక్షులు కదం మోహన్‌రావ్ పాటిల్ సూచించారు. బుధవారం బైంసాలో ఆమెవ ప్రతినిధులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. అరె మరాఠ సంఘానికి చెందిన విద్యార్థుల ఉన్నత విద్యభ్యాసానికి ప్రోత్సహించే రీతిలో చర్యలు చేపట్టాలన్నారు. అవసరమైన సహాయ సాకారాలు అందించాలని పేర్కొన్నారు. ఇదే క్రమంలో అరె మరాఠ సంఘ అభ్యున్నతికి, సభ్యుల సంక్షేమానికి తోడ్పాటును ఇవ్వాలన్నారు. అరె మరాఠ వెల్ఫేర్ ఎంప్లాయిస్ అసోసియేషన్ సంఘ సభ్యులందరూ సంఘటితంగా ముందుకు సాగుతూ సమాజ హితమే తమ అభిమతంగా వ్యవహరించాలన్నారు. అరె మరాఠ సంఘం గౌరవాధ్యక్షులు జాధవ్ పుండలిక్‌రావ్ మాట్లాడుతు సమాజ సేవకు ఆమెవా సంఘం అంకితభావంతో పాటు పడాలన్నారు. మరాఠ సమాజాన్ని ప్రగతి పథంలో తీసుకెళ్లేందుకు బాధ్యతయుతంగా తోడ్పాటునివ్వాలన్నారు. ఈ సందర్భంగా ఆమెవా గౌరవ అధ్యక్షులు వీర్వా పాటిల్, అధ్యక్షులు ప్రదీప్ పాటిల్, ప్రధాన కార్యదర్శి బాబురావు పాటిల్‌లను అరె మరాఠ సంఘం ఘనంగా సన్మానించి జ్ఞాపికలను బహూకరించారు. ఇందులో అరె మరాఠ సంఘం ప్రతినిధులు కంఠాలే రఘువీర్ పాటిల్, ఉపాధ్యక్షులు సూర్యవంశీ కాశీరాంలతో పాటు పలువురు పాల్గొన్నారు.



ఆమెవా ప్రతినిధులతో అరె మరాఠ సంఘం కార్యవర్గ బాధ్యులు

రోడ్డుపై గుంతలు పూడ్చండి

కుంటాల, నవంబరు, 12 (ఆంధ్రజ్యోతి): మండ కేంద్రం కుంటాల నుంచి కల్లూరు వెళ్లే రహదారిపై గుంతలు ఏర్పడి వాహన చోదకులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారని గుంతలు పూడ్చి రోడ్డు మరమ్మతులు చేపట్టాలని కోరుతూ బుధవారం కుంటాల మండల బీజేపీ నా యకులు జక్కుల గజేందర్, వడ్నం రమేష్, సట్ల శ్రీనివాస్‌లు ఎమ్మెల్యే రామారావు పటేల్ దృష్టికి తీసుకెళ్లారు. రోడ్డు మధ్యలో ప్రమాదకరంగా గుంతల మూలంగా తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని గుంతలు పూడ్చితే ప్రమాదాలు జరిగే అవకాశం ఉం డదని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అదే విధంగా కుంటాల సహకార సంఘం ఆవరణలో రైతులు ధాన్యం విక్రయించేందుకు తీసుకవచ్చిన సమయం లో ఇబ్బందులు తలెత్తుతున్నాయని, గ్రావెల్ వేసేందుకు నిధులు మంజూరు చేయా లని ఆయన దృష్టికి తీసుకెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించి త్వరలో నిధులు మంజూరు చేస్తానని పేర్కొన్నారు.



ఎమ్మెల్యేకు విన్నవిస్తున్న కుంటాల మండల నాయకులు

వినతి పత్రం అందజేత

బాసర, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మధ్యాహ్న భోజన పథకం కార్మికులు బుధవారం తహసీల్దార్ పవన్ చంద్రకు వినతి పత్రం అందజేశారు. తమకు గత 8 నెలలుగా కోడి గుడ్డు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని అదే విధంగా వేతనాలను సమయానికి చెల్లించడం లేదని, వెంటనే వేతనాలను చెల్లించాలని కోరారు. అప్పులు కుప్పలుగా అయిపోతున్నాయని, తమ గోడును వెలిబుచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికులున్నారు.

బాసర గ్రామాభివృద్ధి కమిటీ ఎన్నిక

బాసర, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : బాసర 5వ గ్రామాభివృద్ధి కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నూకం లింగారావు, ఉపాధ్యక్షులుగా వడ్డెర ఏ. రమేష్, కోశాధికారిగా క్యాషియర్ పద్మశాలి ఏ. విజయ్, చిట్టెపు గురప్ప శంకర్, ప్రధాన కార్యదర్శి వడ్ల గణేష్, సాంస్కృతిక కార్యదర్శిగా చాకలి బి.అశోక్, పీఆర్‌వోగా కుమ్మరి భూమేష్, మిగతా సభ్యులను ఎన్నుకున్నారు. నూతన కమిటీని గ్రామస్తులు సన్మానించారు.

సైబర్ నేరాలపై అవగాహన

బాసర, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కిర్గుల్(కే) గ్రామంలో సైబర్ నేరాల పట్ల బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై బి. శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో ప్రతి ఒక్కరు స్మార్ట్ ఫోన్ వాడటం సర్వసాధారణమైందని అన్నారు. స్మార్ట్‌ఫోన్ల వల్ల లాభం ఎంత ఉందో నష్టం కూడా అంతే ఉందని తెలియజేశారు. అదే విధంగా వన్‌టైం పాస్‌వర్డ్‌లను పంచుకోవద్దని సూచించారు.

కాల్వ, గుండంపల్లి, సాంగ్విలో

వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం



కాల్వలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ఏఎంసీ చైర్మన్

దిలావర్‌పూర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : కాల్వ, గుండంపల్లి, సాంగ్వి గ్రామాల్లో డీఆర్డీఏ ఐకేపీ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను నిర్మల్ మార్కెట్ కమిటీ చైర్మన్ సోమ భీమ్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా భీమ్ రెడ్డి మాట్లాడుతూ దళారుల నుంచి రైతులను కాపాడటం కోసం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. రైతులు దళారులను నమ్మకుండా ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలన్నారు. ఆయా గ్రామాల్లో జరిగిన కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కే. దేవేందర్ రెడ్డి, కాల్వ మాజీ సర్పంచ్ ఇప్ప నర్సారెడ్డి, కాల్వ నరేష్, ఏపీఎం బోసు, సీసీలు ఎన్. ముత్యం, గడ్డం పోశెట్టి, వీవోఏలు ముత్యం, సక్కారం, సంజయ్, రాములు, మండల సమాఖ్య అధ్యక్షురాలు ఎం. సునీత, మండల వ్యవసాయ అధికారి రాజశేఖర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సోన్‌లో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం



కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాంలో మాట్లాడుతున్న సీఐ గోవర్ధన్ రెడ్డి

సోన్, నవంబరు 12 (ఆం ధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని జిల్లా ఎస్పీ డాక్టర్ జానకి షర్మిల ఆదేశాల మేరకు కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించడం జరిగిందని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బి. గోవర్ధన్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు సరైన ధ్రువపత్రాలు ఉంచుకోవాలని, ఖచ్చితంగా వాహనానికి లైసెన్స్, ఇన్సూరెన్స్ కలిగి ఉండాలని, గంజాయి ఎవరైనా అ మ్మిన, త్రాగిన పోలీసులకు సమాచారం అందించాలన్నారు. అంతేకాకుండా సైబర్ నేరాలు అయిన ఏపీకే ఫైల్స్, బ్యాంక్ ఖాతా సమాచారం ఎవరికి చెప్పకుండా జాగ్రత్తగా ఉండాలని అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 81 ద్విచక్ర వాహనాలు, 4 ఆటోలు, 1 కారును సీజ్ చేసి, సరైన ధ్రువపత్రాలు చెక్ చేసి వదిలి వేయడం జరిగిందన్నారు. ఫైన్‌లు ఉన్న 42 వాహనాలపై 7,720 ఫైన్ కట్టించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సోన్ సీఐ గోపి, లక్ష్మణచాంద ఎస్సై, మామడ ఎస్సై, సోన్ సర్కిల్ పోలీసులు పాల్గొన్నారు.

బాలికల పాఠశాలలో పాముల కలకలం

బోథ్, నవంబర్ 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బాలికల ప్రా థమిక పాఠశాలలో బుధవారం నాగుపాములు కలకలం రేపింది. మధ్యా హ్నం సమయంలోనాగుపాములు కనిపించడంతో పాఠశాల విద్యార్థులు ఆందోళనకు గురయ్యారు. ఉపాధ్యాయులు సైతం పాములు కనిపించడంతో పాములు పట్టేవారి కోసం వెతకడం జరిగింది. పాములు పట్టే వ్యక్తి దాదాపు రెండుగంటల పాటు వెతికిన పాములు దొరకలేదు. చివరకు పాములు అక్కడి నుంచి వెళ్లి పోయింది.



బోథ్ బాలికల పాఠశాలలో సంచరిస్తున్న నాగుపాము

పెద్ద చెరువు పంచాయతీకి అప్పగించాలని వినతి



ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

ముథోల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ముథోల్ మండలంలోని చించాల గ్రామంలో పెద్ద చెరువును గ్రామ పంచాయతీకి అప్పగించాలని గ్రామస్థులు ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్‌కు వినతి పత్రాన్ని బుధవారం అందజేశారు. ఈ చెరువు మత్స్యకార సొసైటీ నుండి మినహాయించా లని గ్రామస్థులు కోరారు. సొసైటీ పరిధిలో చెరువు ఉండడంతో ఆయకట్టు రైతులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని, గ్రామస్థులు తమ సమస్యలను ఎమ్మెల్యేకు తెలియజేశారు. తక్షణమే సొసైటీ నుండి చెరువును గ్రామ పంచాయతీకి అప్పగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు, ఆయకట్టు రైతులు పాల్గొన్నారు.

ప్రొటోకాల్ రగడ

- కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల మధ్య ఘర్షణ
- డీఎస్పీ రంగ ప్రవేశం లాఠీచార్జీ

బోథ్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): బోథ్ మండల కేంద్రంలోని రైతువేదికలో గురువారం బోథ్, సోనాల మండలాలకు చెందిన లబ్ధిదారుల చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. అయితే స్టేజిపైన గతంలో వివిధ పదవుల్లో ఉన్న వారుకూర్చోవడం జరిగింది. సమావేశం ప్రారంభంకాగానే అక్కడికి చేరుకున్న ఆత్మచైర్మన్ రాజుయాదవ్ ప్రోటోకాల్ పాటించాలని ఎలాంటి అర్హత లేని వారిని స్టేజిపైకి ఎలా ఆహ్వానించాలని పేర్కొంటూ స్థానిక తహసీల్దార్ సుభాష్‌చంద్రను అడగడం జరిగింది. అయితే స్టేజిపైన ఉన్న ప్రోటోకాల్ వర్తించని వారందరిని స్టేజి పై నుంచి దించి వేయాలని లేకుంటే తామే వెళ్తామని పేర్కొన్నారు. ప్రోటోకాల్ లేకుండా ఉన్న వారిని ఎలా కూర్చొబెడతారని మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డుగంగారెడ్డి సైతం అధికారులను అడగం జరిగింది. దీంతో స్టేజిపై కూర్చున్న మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్ జోక్యం కల్పించుకుని నీకు ప్రోటోకాల్ ఉందా మమ్ములను ఎలా దిగిపోమంటామంటూ ఆత్మచైర్మన్ రాజుయాదవ్‌ను ప్రశ్నించారు. ఈయనతో పాటు మాజీ సర్పంచ్ సురేందర్‌యాదవ్ కలుగ చేసుకుని సమావేశం జరగకుండా అడ్డుకుంటున్నారంటూ పేర్కొన్నారు. అయితే ఎమ్మెల్యే జాదవ్ అనిల్ జోక్యం కల్పించుకుని సభనుకొనసాగించారు. అక్కడే ఉన్న వారిని ఉద్దేశించి ఎమ్మెల్యే ప్రసంగిస్తుండగా తొందరగా కాని వాలంటూ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి పేర్కొన్నారు. మీరు ఎందుకు జోక్యం కల్పించుకుంటున్నారు అంటూ ఎమ్మెల్యే పేర్కొన్నారు. దీంతో గొడవ ప్రారంభమైంది. ఒక దశలో బీఆర్ఎస్ నాయకులు కొంత మంది కార్యకర్తలు, కూర్చీలు విసరడంతో ఎమ్మెల్యే వారించారు. మరోవైపు కాంగ్రెస్ పార్టీ నాయకుల పైన కొందరు దాడికి పాల్పడగా స్థానిక ఏఎస్సై భోజన్న నాయకులను ఆపేందుకు ప్రయత్నించిన ఫలితం లేకుండా పోయింది. ఒకరిపై ఒకరు దాడులకు పాల్పడడంతో విషయం ఎస్సై శ్రీసాయికి సమాచారం చేరవేయడంతో పోలీసులతో కలిసి అక్కడికి చేరుకున్నారు. ఆపేందుకు ప్రయత్నించి ఇరువర్గాల వారినీ శాంతింప చేశారు.



రాస్తారోకో చేస్తున్న కాంగ్రెస్ పార్టీనాయకులు

పార్టీ శ్రేణులకు సమాచారం

కాంగ్రెస్ పార్టీ నాయకుల పైన దాడి చేశారన్న సమాచారాన్ని మండల కేంద్రంలో ఉన్న కార్యకర్తలకు చేరవేయడంతో కార్యకర్తలు భారీ సంఖ్యలో చేరుకోవడం జరిగింది. దీంతో వివాదం తీవ్రతరం కావడం వల్ల పరస్పర దాడులకు పాల్పడ్డారు.

తహసీల్దార్ వ్యతిరేకంగా నినాదాలు

తహసీల్దార్ ప్రతిపక్ష పార్టీకి చెందిన టీఆర్ఎస్ నాయకులను వేదిక మీదికి ఎలా పిలుస్తారు అంటూ కాంగ్రెస్ పార్టీ నాయకులు తహసీల్దార్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

ఆడ గజేందర్ ఆధ్వర్యంలో ధర్నా...

కాంగ్రెస్ పార్టీ నియోజక వర్గ ఇన్‌చార్జీ ఆడేగజేంద్ర ఆధ్వర్యంలో ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రోటోకాలేని వారిని ఎలా పిలుస్తారు అంటూ నిలదీయడంతో పాటు అధికారులు ఎమ్మెల్యేకు కొమ్ముకాస్తున్నారంటూ విమర్శించారు. అంతేకాక కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకుల వాహనాలు ఎమ్మెల్యే బయటకు రాకుండా అడ్డుపెట్టారు. దీంతో బోథ్, ఇచ్చోడ సీఐలు, ఎస్సైలు గొడవ జరగకుండా ఇరు పక్షాల వారిని సముదాయించారు. అయిన కార్యకర్తలు ఊరుకోకుండా దాడులకు ప్రయత్నించడంతో పరిస్థితి విషమించింది. అప్పుడే అక్కడికి చేరుకున్న డీఎస్పీ జీవన్‌రెడ్డి ఇరువర్గాల వారితో మాట్లాడి అడ్డుగా ఉన్న వాహనాలను తొలగించాలని కోరారు.ఇదే క్రమంలో నడుచుకుంటు వెళ్తున్న ఇరుపార్టీల నాయకులు పరస్పర దాడులకు పాల్పడడంతో డీఎస్పీ లాఠీచార్జీ చేసి ఇరువర్గాల వారిని చెదరగొట్టారు.అనంతరం ఇరుపార్టీల వారు స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఏదిఏమైనా ప్రోటోకాల్ రగడ తీవ్ర దుమారం లేపింది.

ఇద్దరు నిందితులకు 20 ఏళ్ల జైలు

- ఒక్కొక్కరికి రూ. 5 వేల జరిమానా
- తీర్పు వెల్లడించిన నిర్మల్ జిల్లా ప్రిన్సిపాల్ అండ్ సెషన్స్ కోర్టు
- వివరాలు వెల్లడించిన ఎస్పీ జానకి షర్మిల

ఖానాపూర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : స్నేహితుడి భార్యను అపహరించి లైంగిక దాడికి పాల్పడిన ఇద్దరు నేరస్తులకు 20 ఏళ్ల జైలు శిక్ష, చెరో రూ. 5,000ల జరిమానాలను విధిస్తూ నిర్మల్ జిల్లా ప్రిన్సిపాల్ అండ్ సెషన్స్ కోర్టు జడ్జి ఎస్. శ్రీవాణి బుధవారం తీర్పును వెల్లడించినట్లు ఎస్పీ జానకి షర్మిల తెలిపారు. ఈ మేరకు బుధవారం సాయంత్రం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా 2017 సంవత్సరంలో ఖానాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పాత ఎల్లాపూర్ గ్రామానికి చెందిన దండుగుల ధర్మపురి, కుంచెపు గంగాధర్ అనే ఇద్దరు వ్యక్తులు తమ స్నేహితుడి భార్యను అపహరించి లైంగిక దాడికి పాల్పడినట్లు కేసు నమోదయ్యిందని ఎస్పీ పేర్కొన్నారు. ఈ కేసులో సాక్ష్యాధారాలను పరిశీలించిన పిమ్మట నిర్మల్ జిల్లా ప్రిన్సిపల్ అండ్ సెషన్స్ కోర్టు న్యాయాధికారి శ్రీవాణి బుధవారం నేరస్తులకు శిక్షణ విధిస్తూ తీర్పును వెల్లడించినట్లు తెలిపారు. నేటి సమాజంలో నేరం చేసిన వారెవరు తప్పించుకోలేరని ఎస్పీ హెచ్చరిచారు. నేరసులపై కోర్టులు కఠిన చర్యలు తీసుకునేలా నిర్మల్ పోలీసులు ప్రాసిక్యూషన్ వారితో కలిసి ఓ వ్యూహంతో న్యాయ విచారణ, న్యాయ నిరూపణ జరిపి ఖచ్చితంగా శిక్షలు పడేలా చేస్తారన్నారు. ప్రజల భద్రతకు కట్టుబడి నేరస్తులకు న్యాయస్థానాల ద్వారా కఠిన శిక్షలు పడటానికి తగిన సాక్షులను న్యాయస్థానాలలో ప్రవేశపెట్టడానికి నిర్మల్ పోలీసులు చేస్తున్న కృషిని ఆమె అభినందించారు. కాగా ఈ కేసులో నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ కే. వినోద్ రావు, విచారణ అధికారులు ఏ. అశోక్, డ్యూటీ అధికారులు ఏఎస్సై డల్లు సింగ్, హెడ్ కానిస్టేబుల్ ప్రభాకర్, కానిస్టేబుల్ రాజ శేఖర్‌లను ప్రత్యేకంగా అభినందిస్తున్నట్లు ఎస్పీ పేర్కొన్నారు.



నిర్మల్ ఎస్పీ జానకి షర్మిల

వణుకు పుట్టిస్తున్న చలి...



ఆదిలాబాద్‌లో చలి మంటలు కాసుకుంటున్న విద్యార్థులు

ఆదిలాబాద్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : గత కొద్ది రోజులుగా ఆదిలాబాద్ జిల్లాలో చలి తీవ్రత పెరుగుతుంది. ఉదయం సాయంత్రం వేళల్లో చలి తీవ్రతకు జనం వనికి పోతున్నారు. బుధవారం జిల్లా విశ్వసమయం గరిష్ట ఉష్ణోగ్రతలు 29.8 కాగా కనిష్టంగా 11.7 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అత్యల్పంగా సాత్నాల మండలంలో 11.1 బోథ్ మండలం పొ౦రలో 11.2 నేరడిగొండలో 11.3 తలమడుగులో 11.4 బేలలో 11.5 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.. పడిపోతున్న ఉష్ణోగ్రతలకు చలి ప్రభావం ఎక్కువగా కనిపిస్తుంది. మరో వారం రోజులపాటు జిల్లాపై శీతల గాలుల ప్రభావం ఉంటుందని వాతావరణ శాఖ నిపుణులు పేర్కొంటున్నారు. సంక్షేమ హాస్టలల్లో చదువుకుంటున్న విద్యార్థులు చలికి గజగజ వనికి పోతున్నారు. ఉదయం వేళల్లో పాల వ్యాపారాలు వాకర్స్ మున్సిపల్ కార్మికులు ఇతర కూలీలు చలితీవ్రతతో తీవ్ర ఇబ్బందులు పడతున్నారు.

పెరిగిన చలి.. వణుకుతున్న జనాలు.. స్వెట్టర్లకు పెరిగిన గిరాకీ

ఆదిలాబాద్‌టౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా చలితీవ్రత పెరిగింది. గత కొన్ని రోజులుగా కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదు అవుతుండడంతో జిల్లా వాసులు వణికిపోతున్నారు. నిన్న మొన్నటి వరకు ఎండా వేడిమితో ఇబ్బంది పడ్డ ప్రజలకు తాజాగా తగ్గుతున్న ఉష్ణోగ్రతలు వణుకు పుట్టిస్తున్నాయి. చలి తీవ్రతతో ఉదయం పది గంటలు దాటినా బయటకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. గాలిలో తేమ శాతం పెరిగిపోవడంతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. సాయంత్రం అయిదారు గంటలకు చీకటి పడిపోవడం, చలి బాగా ఉండడంతో జన సంచారం పూర్తిగా తగ్గిపోయింది. చలికి తట్టుకోలేక వృద్ధులు, పిల్లలు వణికిపోతున్నారు. ఈ ఏడాది సాధారణం కంటే అధికంగా వర్షాలు కురవడంతో చలి తీవ్రత మరింత పెరిగిందని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. జిల్లాలో అత్యల్పంగా సాత్నాల మండలంలో 11.1 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. చలి తీవ్రత పెరగడంతో స్వెటర్ల దుకాణాల వద్ద గిరాకీ సైతం భారిగా పెరిగింది. మొన్నటి వరకు ఉష్ణోగ్రతలు పెరగడంతో గిరాకీలు తగ్గినా..రెండు మూడు రోజుల నుంచి వాటికి డిమాండ్ ఏర్పడింది. మరికొన్ని రోజుల పాటు చలి తీవ్రత ఇదే విధంగా ఉండే అవకాశం ఉండడంతో ప్రజలు తగు జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచిసున్నారు. ముఖ్యంగా శ్వాస సంబంధిత వ్యాధులతో బాధపడేవారు మరింత అప్రమత్తంగా ఉండాల్సిన వసరముందని చెబుతున్నారు.



స్వెట్టర్ల దుకాణాల వద్ద కొనుగోలు చేస్తున్న జనాలు

చెక్కుల పంపిణీ

నేరడిగొండ నవంబరు12; తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి సీఎం కేసీఆర్‌తోనే గ్రామ పంచాయతీల అభివృద్ధి జరిగిందని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన కల్యాణలక్ష్మి షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఆయన మాట్లాడుతూ..మండల స్థాయి అధికారులు స్థానిక ప్రజా ప్రతినిధులకు ప్రాధాన్యం ఇస్తూ గ్రామాల్లో జరిగే అభివృద్ధి సంక్షేమ పథకాల్లో పాలుపంచుకోవాలన్నారు. ఈసమావేశంలో మాజీఎంపీపీ రాథోడ్‌సజన్, ఎంపీడీవో, తహసీల్దార్ కలీం, ఏంఆర్ఐ, దేవేందర్‌రెడ్డి, రవిందర్‌రెడ్డి,సురేందర్,తదితరులున్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిల్‌జాదవ్

'మైనార్టీ'లో మేజర్ తప్పిదం



పాల ప్యాకెట్లను మోసుకెళ్తున్న విద్యార్థులు



వాగు దాటుతూ పాల ప్యాకెట్లను తరలిస్తున్న విద్యార్థులు

- విద్యార్థులతో ఇవేం పనులు..?
- మైనార్టీ గురుకులానికి పాల ప్యాకెట్ల పెట్టెలు మోసిన చిన్నారులు
- ప్రమాదకరంగా వాగునీటిలో నడిపించిన సిబ్బంది
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజలు
- బాధ్యులపై చర్యలకు డిమాండ్

ఖానాపూర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): చదువుకోవడానికి గురుకులంలో చేరిన విద్యార్థులతో సామగ్రిని మోయిస్తున్న విషయం వెలుగులోకి వచ్చింది. పట్టణంలోని మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థులతో పాల ప్యాకెట్ల పెట్టెలను సిబ్బంది మోయించడం విమర్శలకు తావిస్తోంది. ప్రమాదకరమైన ప్రదేశంలో, వాగునీటిలో నడిపిస్తూ సామగ్రిని విద్యార్థులతో తీసుకురావడం పట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ప్రమాదకరంగా ఉన్న దారిలో పనులు

పాఠశాలకు వెళ్లేదారిలో రెంకోని వాగు తెగిపోయి ఉండడంతో ఆ పాఠశాలకు రాకపోకలు తీవ్ర ఇబ్బందికరంగా మారాయి. వాగు నీటిలో దిగి నడిస్తే తప్ప పాఠశాలకు రావడం తిరిగి వెళ్లడం గాని కుదరని పరిస్థితి. ఇటీవల పాల ప్యాకెట్ల పెట్టెలను తెచ్చేందుకు ఓ నలుగురు విద్యార్థులు పాఠశాల నుంచి వాగు దాటి కిలోమీటరు దూరంలో ఉన్న గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాల వద్దకు వచ్చి ఓ పాల ప్యాకెట్ల పెట్టెను మోసుకొని వెళ్లారు. విద్యార్థులు పాల ప్యాకెట్లను రెంకోని వాగులో దిగి మోసుకొని వెళ్తున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ప్రిన్సిపాల్, వార్డెన్‌ల తీరుపై పలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పాఠశాలలో చదువుకునేందుకు వచ్చిన విద్యార్థులతో ప్రమాదకరంగా ఉన్న దారిలో పని చేయించడం పట్ల పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనకు కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

వంట సామగ్రి తెచ్చేందుకు వాగులోకి దిగక తప్పదు

ఖానాపూర్‌లోని మైనారిటీ రెసిడెన్సియల్ స్కూల్‌లో 210 మంది పాఠశాల విద్యార్థులు, 100 మంది కళాశాల విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. కాగా వీరికి విద్యాబోధన కోసం 30 మంది టీచింగ్ స్టాఫ్, ఇతర పనుల కోసం 16 మంది నాన్ టీచింగ్ స్టాఫ్ నిత్యం పాఠశాలకు రాకపోకలు సాగిస్తున్నారు. వీరంతా పాఠశాలకు సుమారు 500ల మీటర్ల దూరంలోనే వారి వాహనాలను నిలిపి వేసి వాగులో దిగి నడుస్తూ వెళ్లాల్సిన పరిస్థితి తలెత్తింది. ఇక విద్యార్థులకు అందించే భోజనం సిద్ధం చేసేందుకు సామగ్రి తేవడం సిబ్బందికి కత్తి మీద సాము లాగా మారింది. సామగ్రి సరఫరా చేసేవారు రెంకోని వాగు వరకే వచ్చి వాగుకు అవతలి ఒడ్డున సామగ్రిని ఉంచి వెళ్తున్నట్లు పాఠశాల సిబ్బంది, ఉపాధ్యాయులు చెబుతున్నారు. ఆ సామగ్రిని సిబ్బంది రెంకోని వాగు నీటిలో దిగి మోసుకొని రావాల్సిన పరిస్థితి నెలకొంది.



బియ్యం బస్తాను మోసుకెళ్తున్న పాఠశాల సిబ్బంది

విద్యార్థులు వెళ్లడం ఇదే మొదటిసారి

మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్ కు వెళ్లే వంతెన తెగిపోవడంతో పాఠశాలకు ఏ సామగ్రి తీసుకురా వాలన్నా తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. నిత్యం పాఠశాల సిబ్బంది వెళ్లి సామగ్రి తీసుకు వస్తారు. వ్యక్తిగత కారణాలతో నేను నెల రోజులపాటు సెలవులో ఉన్నాను. విద్యార్థులు పాల ప్యాకెట్ల కోసం వెళ్లడం ఇదే మొదటి సారి. గతంలో ఎప్పుడు జరగలేదు. మరోసారి ఇటువంటి ఘటన పునరావృతం కాకుండా చూసుకుంటాం.

- సత్యం, మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్ ప్రిన్సిపాల్, ఖానాపూర్

మంచు కురిసే వేళలో..



చలి ఇందూరు జిల్లాను వణికిస్తోంది. రాత్రి మొదలైన పొగమంచు ఉదయం 9 గంటలైనా వదలడం లేదు. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మెండోర మండల కేంద్రంలో శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని పొగమంచు కమ్మేసింది. అప్పుడే సూర్యకిరణాలు పడుతుండగా.. మంచులో నుంచి ఆలయం అద్భుతంగా కనిపించింది. ఈ దృశ్యం చూపరులను ఆకట్టుకుంది. - మెండోర

రేకులపల్లికి ఆర్టీసీ బస్సు నడపాలి

ధర్పల్లి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి):మండలంలోని రేకులపల్లికి ఆర్టీసీ బస్సు నడపడం లేదని గ్రామస్థులు గ్రామంలో వాల్గోట్-భీమ్‌గల్ రోడ్డుపై బైఠాయించి బుధవారం పెద్ద సంఖ్యలో ధర్నా నిర్వహించారు. మూడు రోజుల క్రితం ఓ వృద్ధుడు మరణిస్తే ఆయన కూతురు గ్రామానికి రావడానికి సాయంత్రం అయిందన్నారు. ఇలా అన్నింటికి అవస్థలు పడుతున్నామని వాపోయారు.



రోడ్డుపై నిరసన తెలుపుతున్న మహిళలు

క్రైం సమాచారం

తండ్రి మృతికి కారణమయిన కొడుకుకు ఏడేళ్ల జైలు శిక్ష

ఆదిలాబాద్‌టౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మద్యంతాగి తండ్రి కారణమైన కొడుకుకు ఏడేళ్లకఠిన కారాగార జైలు శిక్షరూ.వెయ్యి జరిమానావిధిస్తూ జిల్లాన్యాయాధికారి ప్రభాకర్‌రావు తీర్పువెలువరించా రు. ఉట్నూర్ మండలం రాజన్నగూడ గ్రామానికి చెందిన నేరస్తుడు గడ్డం భగవాన్ గతేడాది తన తండ్రి ఎగు గడ్డం భూమన్నను రైతు బంధు డబ్బులు ఇవ్వమని అడగగా, తండ్రి డబ్బులు ఇచ్చేందుకు నిరాక రించారు. దీంతో తండ్రిని ఇనుప రాడ్‌తో కొట్టి గాయపర్చాడు. బాధి తుడు చికిత్స పొందుతూ రెండు రోజుల తర్వాత రిమ్స్‌లో మృతి చెం దాడు. అప్పటి ఉట్నూర్ ఎస్సై మనోహర్ కేసు నమోదు చేయగా... సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మొగిలి విచారణ జరిపి చార్జి షీట్ దాఖలు చేశారు. లైజన్ అధికారి గంగాసింగ్, కోర్టు డ్యూటీ పోలీస్ అధికారి సీహెచ్. నరేందర్ 23 మంది సాక్షులను కోర్టులో హాజరు పర్చారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఏఏ రహీమ్ నేరాన్ని రుజువు చేయించగా... జిల్లా న్యాయాధికారి కె.ప్రభాకర్ రావు ముద్దాయికి ఏడేళ్ల జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు.

క్షణికావేశంలో యువకుడి ఆత్మహత్య

ఉట్నూరు, నవంబరు12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్కారం గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న రాంజీగోండునగర్‌లో భార్యభర్తల మధ్య జరిగిన చిన్నగొడవతో క్షణికావేశానికి లోనైనా విఠల్(30) ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడని బంధువులు తెలిపారు. మంగళవారం రాత్రి భార్యగంగామణి, భర్త విఠల్‌ల మధ్య చిన్న మాట మాట పెరగడంతో క్షణికావేశానికి లోనైనా విఠల్ ఇదే గ్రామంలో ఉన్న సోదరుడి ఇంటికి వెళ్లి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడడంతో గమనించిన బంధువులు వెంటనే ఆసుపత్రికి తరలించగా మృతి చెందాడని తెలిపారు. భార్య ఫిర్యాదు మేరకు ఉట్నూర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అప్పుల బాధతో రైతు బలవన్మరణం

ఉట్నూర్, నవంబర్12 (ఆంధ్రజ్యోతి): అతివృష్టితో పత్తి పంట దెబ్బతిని, ఐదు ఎకరాల్లో సాగు చేసిన పంటకు దిగుబడి రాక పోవడంతో కుంగిపోయిన గిరిజన యువ రైతు, పంట కోసం చేసిన అప్పులను ఎలా తీర్చేదని మదనపడుతు బలవన్మరణానికి పాల్పడిన సంఘటన ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలంలోని చింతగూడలో చోటు చేసుకుంది. గ్రామస్థులు, మాజీ ఎంపీపీ పంద్రజయవంతరావు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం 8 నెలల క్రితం బోథ్ మండలం బాబ్రి గ్రామానికి చెందిన లక్ష్మితో వివాహం జరిగిన అర్కభీమ్రావు(31) ఘన్‌పూర్ పంచాయతీ పరిధిలోని చింతగూడలో ఇంట్లో ఎవరు లేని సమయంలోఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడని తెలిపారు. గత దీపావళి పండుగకు భార్యలక్ష్మితో కలిసి అత్తగారి ఇంటికి వెళ్లిన భీమ్రావు ఒక్కడే సోమవారం గ్రామానికి చేరుకున్నాడని తెలిపారు. మంగళవారం తాను సాగు చేస్తున్న 5 ఎకరాల పత్తి పంట భూమిలోకి వెళ్లి అక్కడ పంటను చూసి దిగుబడి రాదని భావించి అప్పులు తీర్చడం కష్టమవుతుందని ఆత్మహత్యకు ఒడిగట్టి ఉంటాడని వారు వివరించారు. సుమారు రూ.5లక్షల వరకు అప్పు ఉంటుందని తెలిపారు. అర్క భీమ్రావు తల్లిదండ్రులు చనిపోవడంతో గ్రామంలో అన్న ఉన్నప్పటికి సోదరి స్వరూప తన వద్ద ఉంచుకున్నాడని ఆమెకు వివాహం జరిపించాల్సిన బాద్యత భీమ్రావు పై ఉండేదని తెలిపారు. భీమ్రావు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరు అవుతున్నారు. మాజీ ఎంపీపీ పంద్రజైవంతరావు పోలీసులకు సమాచారం అందించడంతో ఉట్నూర్ పోలీసులు బుధవారం శవపంచనామ జరిపి మృతదేహాన్ని ఉట్నూర్ ఆసుపత్రికి పోస్టుమార్టం కోసం తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉరేసుకుని కానిస్టేబుల్ ఆత్మహత్య

బోథ్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి):బోథ్ మండలంలోని కనుగుట్ట గ్రామానికి చెందిన ఈ దాపు ఆదిత్య (30) సంవత్సరాలు అనే కానిస్టేబుల్ బుధవారం మధ్యాహ్నం ఎవరు లేని సమయంలో తన ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడు నిర్మల్ జిల్లా కేంద్రం పోలీసు స్టేసన్‌లో విధులు నిర్వహిస్తున్నట్లు తెలిసింది.ఈమేరకు స్థానిక ఎస్సై శ్రీసాయి కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గుండెపోటుతో ఒకరి మృతి

బోథ్,నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సయ్యద్ యాకుబ్ అలీ అనే వ్యక్తి బుధవారం రాత్రి చాతిలో నొప్పితో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందారు. తొలుత వైద్యుడి సలహా మేరకు ఆస్పత్రి కాం పొందర్లు ప్రాథమిక చికిత్స చేశారు. అనం తరం అక్కడికి చేరుకున్న డాక్టర్ చికిత్స ప్రారంభించారు. అయినా ఫలితంలేక పోవడంతో యాకూబ్‌మృతిచెందారు. వైద్యం సరిగా అం దకపోవడంతోనే యాకూబ్ మృతిచెందాడని అర్ధరాత్రి ఆందోళనకు దిగారు. ఎస్సై శ్రీసాయి అక్కడకు చేరుకుని పంపించివేశారు.

అర్లీ ఎక్స్ రోడ్డు వద్ద ఘోర ప్రమాదం

- బైక్‌ను ఢీకొట్టిన కారు
- ఒకరికి గాయాలు

నర్సాపూర్(జి), నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : కుంటాల మండలం, డౌనెల్లికి చెందిన సాకటి లక్ష్మణ్(52) మంగళవారం లోకేశ్వరం వెళ్తుండగా అర్లీ ఎక్స్ రోడ్డు వద్ద ప్రమాదం జరిగింది. ఆసిఫాబాద్ జిల్లాకు చెందిన పాఠన్ గౌస్ ఖాన్ అతివేగంగా కారును నడపడంతో కారు మోటార్ సైకిల్‌ను ఢీకొట్టడంతో ఆయన తలకు, శరీర భాగాలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే నిర్మల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. లక్ష్మణ్ భార్య సాకటి అడెల్ల ఇచ్చిన ఫిర్యాదు మేరకు నర్సాపూర్(జి) పోలీస్ స్టేషన్‌లో ఏఎస్సై శంకర్ కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

కొండెక్కిన గిరిజన చదువులు

బోథ్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి):మండలంలోని రఘునాథపూర్‌లోని గిరిజన ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం గత రెండు నెలల క్రితం పదవి విరమణ పొందడంతో అక్కడి విద్యార్థుల చదువులు కొండెక్కాయి. ఉపాధ్యాయుడు పదవి విరమణ పొందిన విషయం తెలియని చిన్నారులు ప్రతిరోజు పాఠశాలకు వచ్చి అక్కడే ఆడుకుని ఇంటికి తిరిగి వెళ్తున్నారు. పాఠశాలలో చదువుకునేందుకు అర్హత ఉన్నవారు ఉన్న ఉపాధ్యాయుడు రాక పోవడంతో విద్యార్థులు చదువులకు నోచుకోలేక పోతున్నారు. గిరిజన సంక్షేమానికి ప్రభుత్వం ఏటా కోట్లాది రూపాయలు కేటాయిస్తున్న మారుమూలన ఉన్న రఘునాథ్‌పూర్‌కి చెందిన టీచర్ పదవి విరమణ పొందిన తర్వాత పాఠశాలకు మరో టీచర్‌ను నియమించక పోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్త పరుస్తున్నారు.చదువులకు ఆటంకం కలిగించకుండా ఉపాధ్యాయుడు నియమించాల్సిన అవసరం ఉంది.

ఘనంగా గోరింటాకు గాజుల పండుగ

ముథోల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన ముథోల్ లోని బసవ గార్డెన్‌లో బుధవారం మార్కండేయ సంఘం మహిళలు, యువతులు ఉత్సాహంగా చేతులకు గోరింటాకు పెట్టుకొని గాజుల పండుగను ఘనంగా జరుపుకున్నారు. భారతీయ సంప్రదాయంలో గాజులకు ఉన్న ప్రత్యేక స్థానాన్ని గుర్తు చేసుకుంటూ, ఒకరి కొకరు గాజులు వేసుకొని, గోరింటాకు పెట్టుకు న్నారు. ఆటపాటలతో ఆహ్లాదంగా గడిపిన ఈ కార్యక్రమం స్నేహితుల మధ్య ప్రేమను వ్యక్తపరిచే అపురూప ఘట్టంగా నిలిచింది. ఈ కార్యక్రమాన్ని అపురూపంగా జరుపుకున్నారు. సాంప్రదాయబద్ధంగా సంస్కృతి సంప్రదాయానికి నిలయంగా ఈ గాజుల పండుగ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించుకుం టున్నారు. ఒకరికొకరు గాజులు వేసుకుంటూ రోజంతా ఉల్లాసంగా గడిపారు. ఈకార్యక్రమంతో ప్రేమ, ఆప్యాయత, అనురాగాలు పెరుగడమే కాకుండా సత్సంబంధాలు బలపడుతాయని పేర్కొన్నారు.



గాజులు వేసుకుంటున్న మహిళలు



గాజుల పండుగలో మహిళలు

ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
బుధవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 29.8, కనిష్ఠం 11.7

ఆదిలాబాద్
జిల్లా వార్తలు
5
గురువారం 13 నవంబరు 2025


మాట్లాడుతున్న రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య

స్థానిక సంస్థల బలోపేతంతో గ్రామీణాభివృద్ధి వేగవంతం

- రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య

ఆదిలాబాద్ టౌన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఆర్థిక స్థితి బలోపేతం కావడం ద్వారానే గ్రామీణాభివృద్ధి వేగవంతమవుతుందని రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం కమిషన్ చైర్మన్ అధ్యక్షతన జరిగిన సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. ఇందులో కమిషన్ సభ్యులు రమేష్, కార్యదర్శి కాత్యాయిని దేవి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్‌లు, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, అదనపు కలెక్టర్‌లు, స్థానిక సంస్థల ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలోని పంచాయతీల ఆదాయం, వ్యయాల స్థితి, పన్నుల వసూళ్లు, నిధుల వినియోగం, పేదరిక నిర్మూలన, గ్రామీణ గృహనిర్మాణం, విద్యుత్, తాగునీటి సరఫరా, రహదారులు, పారిశుధ్యం వంటి అంశాలపై ఆయా జిల్లాల కలెక్టర్‌లు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమగ్ర వివరాలు అందజేశారు. అనంతరం రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, సభ్యుడు రమేష్, కార్యదర్శి కాత్యాయిని దేవిలను అధికారులు శాలువాలు, జ్ఞాపికలతో సత్కరించారు. ఈ సందర్భంగా చైర్మన్ సిరిసిల్ల రాజయ్య మాట్లాడుతూ... గ్రామీణాభివృద్ధి వేగవంతం కావాలంటే స్థానిక సంస్థల ఆర్థిక స్థితి బలోపేతం కావడం అత్యవసరమని తెలిపారు. నిధుల వినియోగం పారదర్శకంగా, సమర్థవంతంగా ఉండాలని, పంచాయతీలు, మున్సిపాలిటీలు ప్రజల ప్రాథమిక అవసరాలపై దృష్టి పెట్టి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. కేంద్ర, రాష్ట్ర నిధుల ద్వారా గ్రామ పంచాయతీలను బలోపేతం చేయాలన్నారు. ప్రజాస్వామ్యం ఫలాలు సామాన్య ప్రజలకు చేరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి రూపాయి ప్రజా ప్రయోజనానికి వినియోగించబడాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఉమ్మడి జిల్లా కలెక్టర్‌లు రాజర్షి షా, అభిలాష అభినవ్, కుమార్ దీపక్, వెంకటేష్ దోత్రే, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌లు సోమ రాజేశ్వర్, ఫైజాన్ అహ్మద్, దీపక్ తివారి, ఆర్డీఓ స్రవంతి, పంచాయతీ రాజ్, శాఖ అధికారులు అధికారులు పాల్గొన్నారు.


ఇంటి నుంచి తెచ్చుకున్న దుప్పట్లను కప్పుకొని నిద్రిస్తున్న విద్యార్థులు

వణుకు పుట్టిస్తున్న చలి

- సాత్నాలలో అత్యల్పంగా 11.1 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత

7లో


- జిల్లా కేంద్రంలో ఓ జిన్నింగ్‌లో నిల్వ ఉంచిన సర్కీ (పత్తి గింజలు)
- జిన్నింగ్‌లో పత్తిని డంప్ చేస్తున్న దృశ్యం

అడ్డగోలు.. దందా!

> పత్తి పంటను.. కొనుగోలు చేస్తున్న కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) మార్కెట్ యార్డుల నుంచి పత్తిని లీజుకు తీసుకున్న జిన్నింగ్ మిల్లులకు తరలిస్తుంది. వ్యాపారులు పత్తిని జిన్నింగ్ ప్రాసెసింగ్ అండ్ ప్రెసింగ్ చేసిన తర్వాత బేళ్ల రూపంలో సీసీఐకి తిరిగి అప్పగించాల్సి ఉంటుంది. ఇదంతా యేటా జరిగే తతంగమే అయినప్పటికీ.. కొందరు జిన్నింగ్ వ్యాపారులు సీసీఐ అధికారులతో కుమ్మకై అడ్డగోలు దందాలకు ఎగబడుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పత్తిని ప్రాసెసింగ్ చేసిన తర్వాత వచ్చే సర్కీ (కాటన్ సీడ్)ని కూడా సీసీఐకి అప్పగించాల్సి ఉంది. కానీ సర్కీని అప్పగించడంలో కొందరు జిన్నింగ్ మిల్లర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారన్న వాదనలు సర్వత్రా వినిపిస్తున్నాయి.

- జిన్నింగ్ వ్యాపారుల మాయాజాలం
- సీసీఐ అధికారులతో కుమ్మకై అక్రమాలు
- టెండర్లు వేయకుండానే సర్కీ(కాటన్ సీడ్)ని తరలిస్తూ స్వాహా చేస్తున్న వైనం
- మిల్లుల్లో స్టాక్ నిల్వలపై ఉన్నతాధికారులకు తప్పుడు నివేదికలు
- విజిలెన్స్ విచారణ జరిపిస్తే అసలు భాగోతం బట్టబయలు
- జిల్లావ్యాప్తంగా మొత్తం 33 జిన్నింగ్ మిల్లులు

ఆదిలాబాద్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇప్పటికే వేల క్వింటాళ్ల సర్కీ(కాటన్ సీడ్)ని పక్కదారి పట్టించినట్లు తెలుస్తుంది. సీసీఐ ఒప్పందం ప్రకారం జిన్నింగ్ మిల్లులను ఎల్-1, ఎల్-2, ఎల్-3 మూడు విభాగాలుగా విభజించి కొనుగోలు చేసిన పత్తిని తరలిస్తున్నారు. జిల్లాలో 33 జిన్నింగ్ మిల్లులు ఉన్నాయి. ఎల్-1, ఎల్-2 విధానం ప్రకారం.. ఇప్పటి వరకు 11 జిన్నింగ్ మిల్లులకు సీసీఐ పత్తిని తరలించింది. గడిచిన పక్షం రోజుల్లో 1,733 మంది రైతుల నుంచి కొనుగోలు చేసి 29వేల 677 క్వింటాళ్ల పత్తిని జిన్నింగ్ మిల్లులకు తరలించారు. అయితే క్షేత్రస్థాయిలో ఉన్న వాస్తవ పరిస్థితులకు.. సంబంధిత అధికారులు చూపుతున్న సర్కీ లెక్కలకు ఏమాత్రం పొంతన లేకుండానే పోయిందంటున్నారు. జిన్నింగ్ మిల్లుల్లోని సర్కీ నిల్వలపై నిఘా సారిస్తే వ్యాపారుల అసలు భాగోతం బయటపడే అవకాశం ఉందంటున్నారు.

జిన్నింగ్ మిల్లుల్లో సర్కీ గయాబ్

వ్యాపారుల ఇష్టారాజ్యం

సీసీఐ జిన్నింగ్ మిల్లులకు పత్తిని సరఫరా చేస్తున్న కొందరు వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు లేకపోలేదు. ఒక్కో బేల్‌ను ప్రాసెసింగ్ చేసినందుకు గాను టెండర్ ప్రకారం రూ.1,420 నుంచి రూ.1,441 వరకు చెల్లిస్తున్నారు. అంటే వ్యాపారులు ఒక పత్తి బేల్‌ను తయారు చేసి సీసీఐకి అప్పగిస్తే ప్రాసెసింగ్ చార్జీగా రూ.1,441ను సీసీఐ చెల్లిస్తుంది. జిల్లాలో అక్టోబరు 27 నుంచి సీసీఐ పత్తి కొనుగోళ్లను ప్రారంభించింది. గడిచిన పక్షం రోజుల్లో 29వేల 677 క్వింటాళ్ల పత్తిని సేకరించి జిన్నింగ్ మిల్లులకు తరలించింది. అంతేకాకుండా క్వింటాల్ పత్తికి 33 కిలోల లింట్ (దూది), 2 కేజీల తరుగు పోను 65కేజీల సర్కీని సీసీఐకి అప్పగించాలి. ఈ లెక్కన ఇప్పటి వరకు 19లక్షల 29వేల 5 క్వింటాళ్ల సర్కీ నిల్వలు ఉండాలి. కానీ క్షేత్రస్థాయిలో దీనికి భిన్నమైన పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఇప్పటి వరకు పత్తిని సరఫరా చేసిన మిల్లుల్లో సరైనా సర్కీ నిల్వలు లేవని తెలుస్తుంది. సీసీఐ ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలిస్తే అసలు విషయం బయట పడే అవకాశం ఉందంటున్నారు.

నిబంధనలు గాలికి..

సీసీఐ నిబంధనలు గాలికి వదిలేస్తున్న జిన్నింగ్ వ్యాపారులు దానికి విరుద్ధంగా సర్కీని అమ్మేసుకుంటూ వచ్చే ఆదాయాన్ని జేబుల్లో వేసుకుంటున్నారన్న ఫిర్యాదులు వస్తున్నాయి. అసలు నిబంధనల ప్రకారం టెండర్ వేసిన తర్వాతనే సర్కీని అమ్ముకునే అవకాశం ఉంటుంది. కానీ కొందరు జిన్నింగ్ వ్యాపారులు సీసీఐ అధికారుల అండతో టెండర్ వేయకుండా ముందే సర్కీని స్వాహా చేస్తున్నట్లు తెలుస్తుంది. ధర తగ్గిన తర్వాత టెండర్లు వేస్తూ తప్పుడు లెక్కలు

(తరువాయి 6వ పేజీలో....)

డబ్బులు చెల్లించి సర్కీని అమ్ముకోవాలి
: శరత్, సీపీవో ఆదిలాబాద్

సీసీఐకి అప్పగించాల్సిన సర్కీని డబ్బులు చెల్లించిన తర్వాతనే జిన్నింగ్ వ్యాపారులు అమ్ముకోవాల్సి ఉంటుంది. అది కూడా టెండర్ ద్వారా తీసుకోవాలి. ఇప్పటి వరకు నిబంధనలకు విరుద్ధంగా వ్యాపారులు సర్కీని అమ్మేసుకున్నట్లు మా దృష్టికి రాలేదు. ధరల్లో హెచ్చుతగ్గులు ఉంటాయి. జిన్నింగ్ వ్యాపారులు ప్రైవేట్‌గా కొనుగోలు చేసిన సర్కీని మాత్రమే అమ్ముకుంటున్నట్లు తెలుస్తుంది. వెంటనే క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటాం.

ప్రభుత్వ పాఠశాలల్లో నిర్ణీత గడువులో పనులు పూర్తి చేయాలి : కలెక్టర్

ఆదిలాబాద్ టౌన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన మౌలిక సదుపాయాల పనులను నిర్ణీత గడువులో పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో బజార్‌హత్నూర్, ఇంద్రవెల్లి, తలమడుగు, తాంసి, ఉట్నూర్ మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల పురోగతిపై కలెక్టర్ రెండవ దశ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, విద్యార్థుల భవిష్యత్తు బలోపేతానికి పాఠశాలల్లో సమగ్ర మౌలిక సదుపాయాలు తప్పనిసరి అన్నారు. పాఠశాలల్లో సమగ్ర సదుపాయాలు ఉంటేనే విద్యార్థుల హాజరు, విద్యా ప్రమాణాలు మెరుగుపడతాయి. ఇప్పటికే అనేక పనులకు నిధులు విడుదలైనందున అధికారులు వేగంగా పూర్తి చేయాలని సూచించారు. విద్య, ఇంజినీరింగ్ శాఖలు సమన్వయంతో పనిచేస్తే నిర్ణీత గడువులో లక్ష్యాలు చేరుకోవచ్చని అన్నారు. అలాగే, మరుగుదొడ్లు, తాగునీటి సదుపాయం, మిషన్ భగీరథ కనెక్షన్‌లు, ప్రహరీ గోడలు, కిచెన్ షెడ్లు, తరగతి గదుల మరమ్మత్తులు వంటి ప్రాథమిక సౌకర్యాలపై నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పాఠశాలల పర్యవేక్షణను క్రమం తప్పకుండా నిర్వహించి, పురోగతి నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. అనంతరం పాఠశాలల వారీగా విద్యుత్ కనెక్షన్‌లు, తాగునీటి సరఫరా, మరుగుదొడ్లు, ఎల్‌పీజీ కనెక్షన్‌లు, కిచెన్ షెడ్లు, ప్రహరీ గోడలు, తరగతి గదుల మరమ్మతు లు వంటి అంశాలపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సమావేశంలో ఐటీడీఏ పీఓ యువరాజ్ మర్మాట్, అదనపు కలెక్టర్, జిల్లా విద్యాధికారి రాజేశ్వర్, ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు, క్లస్టర్ రిసోర్స్ పర్సన్‌లు, కోఆర్డినేటర్‌లు, అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాల తనిఖీ

ఉట్నూర్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఉట్నూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఇంటర్మీడియట్ జిల్లా విద్యాధికారి జాదవ్‌గణేష్‌కుమార్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకులతో సమావేశం నిర్వహించారు. విద్యార్థులను సిలబస్ గురించి మరియు ఇతర సమస్యల గురించి అడిగి తెలుసుకుని అధ్యాపకులకు సలహాలు సూచనలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులుసువర్ణ, శ్రీలత, గణేష్, వినోద్, లక్ష్మణ్, తిరుపతి, దత్తు, అశ్విన్‌చౌహాన్, నీలోఫర్, రానా, సుధాకర్, విష్ణు, అధ్యాపకేతరులు మల్లేష్, సాయికృష్ణలు పాల్గొన్నారు.



అధ్యాపకులతో మాట్లాడుతున్న డీఐఈఓ

లక్ష్య సాధన కోసం ముందడుగు వేయాలి

- ఎంపీ గోడం నగేష్
- ఉట్నూర్‌లో అట్టహాసంగా ప్రారంభమైన జోనల్ స్థాయి క్రీడలు
- డిసెంబరులో రాష్ట్ర స్థాయి క్రీడల కోసం ఎంపికలు
- ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే బొజ్జు, ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో మర్మాట్

ఉట్నూర్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): జోనల్‌స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొంటున్న క్రీడాకారులందరూ లక్ష్యం సాధించే దిశగా ముందడుగు వేయాలని ఎంపీ నగేష్ అన్నారు. ఉట్నూర్ సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలోని గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలల విద్యార్థుల జోనల్ స్థాయి క్రీడా పోటీలు అట్టహాసంగా ప్రారంభం అయ్యాయి. బుధవారం మండల కేంద్రంలోని కొమురం భీం ప్రాంగణంలో ఉన్న క్రీడ మైదానంలో జోనల్ స్థాయి క్రీడా పోటీలను ముఖ్య అతిథులుగా హాజరైన ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యులు గోడంనగేష్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్‌లతో పాటు ఐటీడీఏ ఇన్‌చార్జి ప్రాజెక్టు అధికారి యువరాజ్ మర్మాట్ జాతీయ పతాకాన్ని, క్రీడా పతాకాన్ని ఆవిష్కరించాక పోటీలను ప్రారంభించారు. ముందుగా ఆదిలాబాద్, బోథ్, నిర్మల్, ఉట్నూర్ డివిజన్‌లలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల నుంచి హాజరైన క్రీడాకారులు నిర్వహించిన మార్చ్‌పాస్ట్‌లో ముఖ్య అతిథులు పాల్గొని క్రీడాకారుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం క్రీడా జ్యోతిని వెలిగించారు. నేటి ఓటమి రేపటికి గెలుపునకు నాందిగా పరిగణిస్తూ క్రీడా స్ఫూర్తితో ఆటల్లో పాల్గొనాలన్నారు.

ప్రతీ ఆశ్రమ పాఠశాలను సందర్శిస్తాం

రానున్న రోజుల్లో ప్రతీ ఆశ్రమ పాఠశాలలను సందర్శించి విద్యార్థుల విద్య అభివృద్ధితో పాటు విద్యార్థులకు అందుతున్న పౌష్టికర బోజనం తీరు, క్రీడల నిర్వహణ తీరు పరిశీలిస్తామన్నారు. నాణ్యమైన బోజనం అన్ని పాఠశాలల్లో అందుతున్నా ఆశించిన మేర విద్య అందడం లేదన్నారు. ఉపాధ్యాయులందరు అంకిత భావంతో పని చేసి గిరిజన విద్యాభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఇటీవల మృతి చెందిన అందెశ్రీతో తనకు ఉన్న అనుబంధాన్ని ఎంపీ నగేష్ గుర్తు చేశారు. చిన్నచిన్న రచనలు చేస్తూప ఆటలు పాడుతూ అంకిత భావంతో కవిగా మారరని, ఆయన మరణం రాష్ట్రానికి తీరని లోటు అని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు.


జోనల్ స్థాయి క్రీడా పోటీలలో మార్చ్‌ఫాస్ట్ నిర్వహిస్తున్న ఆదిలాబాద్ డివిజన్ క్రీడాకారులు

నియోజక వర్గాల అభివృద్ధికి రూ.5కోట్లు

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నియోజకవర్గ అభివృద్ధి పథకం కింద రూ.5కోట్ల నిధులు మంజూరు చేశారని, తన నియోజక వర్గంలోని ఉట్నూర్ ఖానాపూర్ ప్రాంతాలలో ఉన్న గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో విద్యార్థుల క్రీడా నైపుణ్యం పెంపుదల కోసం కావాల్సిన నిధులను అందిస్తానని అన్ని పాఠశాలల్లో ఉత్తమ క్రీడాకారులను తయారు చేయాలని ఎమ్మెల్యే బొజ్జు ఈ సందర్భంగా అన్నారు. తర్వాత ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి యువరాజ్ మర్మాట్, గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ అంబాజి జాదవ్ మాట్లాడారు. డిసెంబర్‌లో ఏటూరు నాగారంలో జరిగే రాష్ట్ర స్థాయి గిరిజన సంక్షేమ క్రీడా పోటీల కోసం జోనల్ స్థాయి క్రీడల్లో ఉత్తమ క్రీడాకారులను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు.


400 మీటర్ల పరుగు పందెంలో విజేతలకు బహుమతిని అందజేస్తున్న ఎంపీ నగేష్, ఎమ్మెల్యే బొజ్జు

మండల కేంద్రంలోని కొమురంభీం క్రీడా మైదానంలో జోనల్ స్థాయి క్రీడా పోటీలను అతిథులు ప్రారంభించారు. ముందుగా 400 మీటర్ల బాల బాలికల అండర్ 17, అండర్ 14లలో జెండా ఊపి ప్రారంభించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఇన్‌చార్జీ జీసీసీ డీఎం గుడిమల్ల సందీప్‌కుమార్, ఏటీడీఓలు సదానంద్, నిహారిక, సుకేష్‌రెడ్డి, జిల్లా క్రీడల అధికారులు కోరెడ్డి పార్థసారథి, భక్యరమేష్, ఆదర్శ క్రీడా పాఠశాల ప్రధానోపాధ్యాయులు జాదవ్‌ఉత్తం, గోడంచందన్, తదితరులు పాల్గొన్నారు.


గిరిజన బాలికల సాంస్కృతిక నృత్య ప్రదర్శన

సిరిచెల్మ ప్రాంతంలో పెద్దపులి సంచారం


- సాత్మోరీ గ్రామ అటవీ ప్రాంతంలో పెద్దపులి పాదముద్రలు

మరిన్ని వివరాలు 6వ పేజీలో....

బాలికల పాఠశాలలో సర్పాల కలకలం

- పాఠశాల ఆవరణలో మధ్యాహ్నం వేళ కనిపించిన రెండు నాగు పాములు
- తీవ్ర భయాందోళనకు గురైన విద్యార్థులు, ఉపాధ్యాయులు
- బోథ్ మండల కేంద్రంలో ఘటన

6లో

ఉత్సాహంగా సాగిన ఐక్యత మార్చ్

- పాల్గొన్న ప్రజా ప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయులు, పెద్దసంఖ్యలో విద్యార్థులు

ఆదిలాబాద్ టౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): దేశ ఐక్యత, ఏకతా, జాతీయ సమగ్రతకు ప్రతీకగా నిలిచిన ఉక్కు మనిషి సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ 150వ జయంతి ఉత్సవాలను ఆదిలాబా ద్ పట్టణంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. కేంద్ర యువజన, క్రీడా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని ఎమై భారత్‌ సంస్థ సమన్వయంతో ఉదయం ఇందిరా ప్రియదర్శిని స్టేడియం నుంచి రెవెన్యూ గార్డెన్స్ వరకు ఐక్యత మార్చ్ పాదయాత్రగా నిర్వహించారు. ఈ పాదయాత్రలో రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యే పాయల్ శంకర్, అదనపు కలెక్టర్ శ్యామల దేవి, అధికారులు, విద్యార్థులు, యువజన సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వందేమాతరం, జైహింద్ నినాదాలతో పట్టణం మాగింది. దేశ ఐక్యతకు అంకితభావంతో యువత, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహనీయుడు పటేల్ సేవలను స్మరించారు. అనంతరం రెవెన్యూ గార్డెన్స్‌లో నిర్వహించిన సమావేశాన్ని పార్లమెంట్ సభ్యుడు గోడం నగేష్ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. వందేమాతరం గీతాలాపనతో కార్యక్రమం ప్రారంభమైంది. అనంతరం ప్రజాప్రతినిధులను, అధికారులను శాలువా, జ్ఞాపకలలో సత్కరించారు. కార్యక్రమంలో విద్యార్థుల దేశభక్తి నృత్యాలు అందర్నీ అలరించాయి. ఈ సందర్భంగా ఎంపీ నగేష్ మాట్లాడుతూ.. పటేల్ దేశ సమైక్యతకు ప్రతీక అని, ఆయన చూపిన మార్గంలో నడుస్తూ యువత దేశాభివృద్ధిలో తమ వంతు పాత్ర పోషించాలన్నారు. కార్యక్రమ సమన్వయకర్తగా జిల్లా ఇన్‌ఛార్జి యువజన అధికారి శైలి బెల్లాల్, డీపీఆర్‌ఓ విష్ణువర్ధన్, డివైఎస్‌ఓ జక్కుల శ్రీనివాస్ సమన్వయం వహించారు. జిల్లా అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు, యువజన సంఘాల ప్రతినిధులు, తదితరులున్నారు.



యూనిటీ మార్చ్‌లో పాల్గొన్న అతిథులు, విద్యార్థులు

నేడు 'మన బడి-మన నీరు'

ఆదిలాబాద్ రూరల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ రూరల్ మండలంలోని చందా, వన్‌వాట్, అంకోలి, ఖండాల, పెద్ద మాలే బోరిగావ్ గ్రామాల్లోని పాఠశాలలో గురువారం కలెక్టర్ ఆదేశాల మేరకు మనబడి-మన నీరు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వంశీకృష్ణ ప్రకటనలో తెలిపారు. ఈ పథకం కింద అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో స్వచ్ఛమైన తాగునీటి సదుపాయం అందించడం, ఇంకుడు గుంతలు నిర్మించడమే ప్రధాన లక్ష్యమన్నారు. ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసి నీటి వృధాను అరికట్టడమే కాకుండా వర్షపు నీటిని భూమిలో ఇంకించి భూగర్భ జలాలను కాపాడుకోవచ్చన్నారు. ఉపాధి పనుల్లో భాగంగా వీటిని నిర్మించడం జరుగుతుందన్నారు.

ఢిల్లీ మృతులకు నివాళి


ఇచ్చోడలో కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న ఎస్పీ అఖిల్ మహాజన్, ఏఎస్పీ కాజల్‌సింగ్

6లో

చెక్కుల పంపిణీలో ప్రొటోకాల్ రగడ	అప్పుల బాధతో రైతు బలవన్మరణం	ఉరేసుకుని కానిస్టేబుల్ ఆత్మహత్య

7లో